# పిల్లల సంక్షేమము

1. రూ. 2,000-00 చి॥ కేదారిశెట్టి కృష్ణామృత గారు, గొల్లప్రోలు
   వీరి పెద్దమ్మ గారు కీ॥శే॥ నార్కెడిమిల్లి సీతారత్నం గారి జ్ఞాపకార్థం
2. రూ. 1,116-00 శ్రీ మదుకూరి రూపాకృష్ణ గారు, బెండపూడి.
3. రూ. 1,116-00 చి॥ మదుకూరి రుషికా సాయి గారు, D/o. ఎమ్. వెంకట రమేష్ గారు, బెండపూడి.
4. రూ. 1,500-00 శ్రీమతి దాట్ల దీప్తి గారు & శ్రీ దాట్ల శివరామరాజు గారు, విశాఖపట్నం

# "అంతటా నీవే"

పువ్వులో దాగున్న నీ రూపం నే చూసా,
ఆ చెట్టు చేమలోని నీ రూపం నే చూసా
గలగల రాలిపడే ఆకుల్లో దాగున్న నీ రూపం నే చూసా
కోయిల పాటలోను నీ రూపం నే చూసా
నను మెత్తగా స్పృశించి వెళ్ళిన
ఆ సీతాకోకచిలుకలోని నీ రూపం నే చూసా
పసిపాపల నవ్వులోను నీ రూపం నే చూసా
ఎగిరే పావురంలోనూ, బెదిరే ఉడుతలోనూ,
పరుగులు పెట్టే బల్లిలోనూ
అరిచే కాకిలోనూ నీ రూపం నే చూసా,
నా హృదయ స్పందనలో నీ రూపం నే చూసా
అణువు అణువున ఉన్నావు, అంతటనూ ఉన్నావు
అద్భుతాలే చూపించావు, నను మొత్తంగా మార్చేసావు
నాలో ఉండి నన్ను నడిపిస్తున్న ఓ గురుదేవా!
మీ పాద పద్మముల యెడ వీడ ఏముంది నాకు
మీ చేతుల్లో మలచబడుతున్న ఈ మట్టిబొమ్మ తప్ప.

– ఇళ్ల శారద (పూనా)



# ఓం

# శాంతి

విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక
స్థాపకులు : పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్‌జీ మహరాజ్
గౌరవ సంపాదకులు : స్వామిని వినమ్రానంద

సంపుటి : 93 జూలై - 2017 సంచిక : 7

## విషయసూచిక

పేజి నెం.

1. ప్రార్థన 02
2. ధ్యానము - శ్రీ చైతన్య మహాప్రభు 02
3. ధ్యానము - స్వామి ఓంకార్, అనువాదం : స్వామి తత్త్వవిదానంద 04
4. సర్వమత శాంతి సమ్మేళనం - మాతా పరా విద్యానందగిరి 07
5. ప్రణవము - బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 10
(శ్రీ శాంతి ఆశ్రమ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశం) గత సంచిక తర్వాత...
6. శాంతి అన్వేషణ - డా॥ ప్రభాకరరావు 14
7. ఉపదేశము - వినతి 18
8. మధుకైటభుల సంహారం - డా॥ వెంకట శివయ్య IAS (Rtd.) 20
9. కైవల్యోపనిషత్తు - స్వామిని శృతానంద 21
10. వెలుగు - సిలువేరు సుదర్శన్ 23
11. భగవద్రామానుజులవారంటే ఎవరు? వారి గొప్పతనమేమిటి? 26
(భగవద్రామానుజుల వారి సహస్రాబ్ది ఉత్సవాలు-2017 సందర్భంగా)
12. గోశాల పునర్నిర్మాణము 28
13. వార్తలు - విరాళాలు 30

☛ ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి – రచయితలే బాధ్యులు కాని, సంపాదకులు కారు. – ఎడిటర్

*జీవిత సభ్యత్వం (12 సం॥) : రూ. 1000/- సాలుసరి చందా : రూ. 100/-*

# ప్రార్థన

శ్లో॥ కృష్ణద్వైపాయనం వ్యాసం సర్వలోకహితే రతమ్ ।
వేదాబ్జభాస్కరం వందే శమాదినిలయం మునిమ్ ॥

**తాత్పర్యం :–** వేదములను విభజించిన వాడును, అన్నిలోకముల వారి మేలును గురించి ఆసక్తి గలవాడును, వేదములనెడి పద్మములను వికసింప జేయుటలో సూర్యుని వంటి వాడును, శమము, దమము మొదలయిన వానికి స్థానమయిన వాడును అగు కృష్ణద్వైపాయన మహామునిని (అనగా వ్యాసభగవంతుని) నమస్కరించుచున్నాను.

# ధ్యానము

**- శ్రీ చైతన్య మహాప్రభు**

శ్లో॥ కదాచిత్ కాళిందీతటవిపిన సంగీతతరళః
ముదా ఉ ఉ భీరీనారీవదనకమలాస్వాద మధుపః ।
రమా శంభు బ్రహ్మా మరపతి గణేశార్చితపదః
జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే ॥ 1

**తాత్పర్యం :–** శ్రీ కృష్ణుడే జగన్నాథుడని బహు ప్రమాణములున్నవి. అందువలననే శ్రీ బలభద్ర సుభద్రలు కూడా దేవాలయమునందున్నారు. కనుక ఈ శ్లోకములో శ్రీకృష్ణుని రూపమాధుర్యము వివరింపబడినది. ఈ దేవుడు కాళిందీ (యమునా) తీరమున ఉన్న ఉద్యానవనములో సంగీతమును (మురళి ద్వారా) పాడుటకు కుతూహలము కలవాడు. ఇక తనకే సర్వము సమర్పించి సేవించుచున్న, సంతుష్టులైన గొల్లపడుచుల ముఖములు కలముల వలె నుండగా, వానియందలి సౌందర్యము అను తేనెను త్రాగునట్టి తుమ్మెదయే ఈ దేవుడు. ఈతని పాదములను లక్ష్మీదేవి, శివుడు, బ్రహ్మ, దేవేంద్రుడు, గణేశుడు మొదలగువారు సేవించుచుందురు. అట్టి శ్రీజగన్నాథస్వామి నాకు నయనపథగామి (ప్రత్యక్షము) అగును గాక !



శ్లో॥ భుజే సవ్యే వేణుం శిరసి శిఖిపింఛం కటితటే
దుకూలం నేత్రాంతే సహచరికటాక్షం విదధతే ।
సదా శ్రీమత్ బృందావనవసతి లీలాపరిచయః
జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే ॥ 2

**తాత్పర్యం :–** ఈ శ్లోకమునందు కూడా శ్రీ జగన్నాథుని శ్రీకృష్ణుని రూపములో శ్రీచైతన్యుడు స్తుతించుచున్నాడు. శ్రీ జగన్నాథుడు శ్రీకృష్ణ రూపములో ఉన్నప్పుడు కుడిచేతితో వేణువును పట్టుకొని ఉండును. తలపై నెమలిఫించముండును. నడుముపై మెరిసే పీతాంబర ముండును. కళ్ళకొసలలో (క్రీగన్నులో) తోటి మిత్రులపై అతని దయావీక్షణము ప్రసరించు చుండును. ఎల్లప్పుడు బృందావన ప్రాంతములోనే నివసించుటకు కృష్ణుడు ఉత్సాహపడు చుండును. ఆ కృష్ణరూపియైన శ్రీ జగన్నాథస్వామి నాకెప్పుడును ప్రత్యక్షము అగును గాక !

శ్లో॥ మహాంభోధే స్తీరే కనకరుచిరే నీలశిఖిరే
వసన్ ప్రాసాదాంతః సహజ బలభద్రేణ బలినా ।
సుభద్రా మధ్యస్థః సకలసురసేవావసరదో
జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే ॥ 3

**తాత్పర్యం :–** పురీక్షేత్రంలో ఉన్న దేవుని రూపము ఈ శ్లోకములో వివరింపబడినది. సముద్ర తీరమున, బంగరు కాంతులతో విరాజిల్లు నీలపర్వతపు శిఖరము.

# "నీరీక్షణ"

నీ కోసం ఇదే నా నిరీక్షణ
నిను చూడాలని పదే పదే నా తపన
తెలియని దారులలో నిను వెతికి అలసిపోయా
నాకు తెలిసిన ఒకే ఒక దారి హృదయపు దారి
అందు వెతకాలని ప్రయత్నము చేసా
కన్నీటి వర్షంలో తడిసి ముద్దయిపోయా
కనిపించవేమి, కనుముందుకు రావేమి
నా హృదయ కమలం విరిసేదెప్పుడు ?
నేను చూసేదెప్పుడు ?
నేను అనేది లేకుండా అయ్యేదెప్పుడు ?
నేను నువ్వుగా మారెదెప్పుడు ?
ఆ క్షణం కోసమే నా నిరీక్షణ
ఈ నిరీక్షణ.

*- ఇళ్ల శారద (పూనా)*

# ధ్యానము

**ఆంగ్లమూలం : స్వామి ఓంకార్** **అనువాదం : స్వామి తత్త్వవిదానంద**

*(గత సంచిక తరువాత...)*

### నిద్రనెరుగని సముద్రములో అలలు యెన్నో, శ్వాసల పుట్టుకలు అన్ని.

కాలప్రవాహంలో జీవునకు ఇన్ని జన్మలు, లెక్కలేనన్ని జన్మలు, నిరంతరముగా అనుగ్రహించబడుట చాలా విడ్డూరమైన విషయము. ఇంతవరకు మనలోని ప్రతి ఒక్కరు ఎన్ని జన్మలను పొంది ఉంటామో అని ఊహిస్తేనే ఆశ్చర్యం కలుగుతోంది. ఇంతే గాక, మన కోసం భవిష్యత్తులో ఇంకా ఎన్ని జన్మలు వేచి ఉన్నాయో! ఈ జననమరణ చక్రము నుండి బయటపడే మార్గము లేదా? ప్రతి యుగమునందు సాధుసంతులు, మహర్షుల యొక్క బోధలు వ్యర్థమైన గోలయేనా? ప్రతియుగమునందలి అవతారమూర్తుల ప్రయత్నములు వ్యర్థమేనా? వారి ధైర్యసాహసములు కొరగానివేనా? ప్రతి యుగమునందు ప్రతి ప్రాంతము నందలి సాధుసంతులు, మహర్షుల సిద్ధాంతవచనములు నిస్సారమైన కల్పనలేనా? మోస పూరితమైన బడాయి కబుర్లేనా? ఆ బోధలు మతం మత్తులో పలికిన పలాయనవాదములా? లేక అవి ఆత్మ యొక్క పరాజయములా? జీవితములోని సవాళ్ల ముందు లొంగిపోయే మాటలా? కాదు, కానే కాదు. అట్టి దృఢసంకల్పులైన మహాత్ములు అట్టి బోధల వలన పొందే ప్రయోజనము గాని, సంతృప్తి గాని ఏమీ లేదు. కాబట్టి నిశ్చితముగా ఒక మార్గము గలదు, తప్పక దరి జేర్చే మార్గము గలదు, చిరకాలము నుండి మానవుడు అన్వేషిస్తున్న మార్గము గలదు, తరచుగా మహాత్ములు నడచిన అట్టి దారిగలదు, యదార్థముగా విజయమునిచ్చే మార్గము కలదు.

అలసి సొలసి తిరుగాడుచున్న బాటసారులారా! నా వద్దకు రండు! **ఒకే ఒక మార్గము గలదు. ఆ మార్గము నేనే.** మీ జీవాత్మల భారమును నాపై మోపుడు. నన్ను ఆశ్రయించుడు. నా యోగమును చేపట్టుడు. అది సరళమైనది. నన్ను అనుసరించుడు. నన్ను కనుగొన్నవాడు శాశ్వతముగా సత్యప్రకాశము నందు ఉండగలడు. అసత్యము యొక్క చీకటి నుండి, ద్వైతము నుండి, అజ్ఞానము నుండి అతడు విముక్తుడగును. అతడు ఎన్నడూ మరణించడు, అతనికి మరల పుట్టుక లేదు. అతడు శాశ్వత కాలము మార్పు లేనివాడు! అతడు కాలము యొక్క మృత్యువు నుండి శాశ్వత జీవనములోకి ప్రవేశించినాడు. ఇక అతనిపై మృత్యువు యొక్క అధికారము ఉండబోదు. కాబట్టి, నేను అదియే అయి ఉన్నాను. నేను మార్గమునై, సత్యమునై, జీవనమునై ఉన్నాను, అని తెలుసుకో! అన్ని మార్గములు మరియు ప్రతి మతము ఈ సత్యము వైపే చూపిస్తోంది. అదంతా ఎన్నటికీ అసత్యము కాజాలదు. ఈ సత్యమును చూచి చెప్పిన



వారందరు తప్ప ప్రయోజనముల కొరకై చెప్పియుండుట అసంభవము. అట్టి ఊహ సత్యదూరము. ఇకపోతే, స్వాతంత్ర్యము (విముక్తి)నకు మార్గము నీ కంటికి యెదురుగా నిలిచి లేదా? ఆ విముక్తిని పొందుట చాలా దూరములోనైతే లేదు అని నీకు ఇప్పుడు స్పష్టముగా తెలియుట లేదా? ఆ మార్గము చిన్నది మరియు సరళమైనది. ఆ మార్గము నీ ఇంటి ద్వారము వద్ద గలదు. అంతే కాదు, ఇంటిలోపల కూడ ఉన్నది, నీ లోపలనే గలదు. నీవు పెద్ద దూరము పయనించనక్కరలేదు. నీవు ఆ మార్గమును చేరుటకై పెద్ద తీర్థయాత్రను చేపట్ట నక్కరలేదు. ఆ మార్గము కొరకై నీవు ఏదో ఒక విగ్రహము చుట్టూ లేదా దేవాలయము చుట్టూ లేదా పవిత్రమైన చెట్టు చుట్టూ సాంప్రదాయక పవిత్ర ప్రదక్షిణములను చేయబనిలేదు. దాని కొరకై నీవు పవిత్ర జలములను స్పృశించవలసిన పని కూడ లేదు. లేదా దాని కొరకై పావనము చేయబడిన ఇతర అంశములను వినియోగించనక్కరలేదు. మీరు వ్రతములను చేపట్టనక్కరలేదు, లేదా కొంతకాలము బ్రహ్మచర్యమును పాటించుట ఇత్యాదులు ఆవశ్యకము కాదు, లేదా కఠినమైన నియమములను పాలించనక్కరలేదు. నీవు వెనువెంటనే, ఇప్పుడు, నీవు నిలిచియున్న చోటనే, దేహాభిమానము (శరీర స్పృహ) నుండి విముక్తుడవైన చాలును. ఇది కేవలము ఒక క్షణములో చేయగలిగే పని. దాని కొరకై నీవు రెండవ క్షణమును వ్యర్థము చేయవలసిన పని లేదు. దీని కొరకై ఇంకో వ్యక్తి నీకు సంరక్షకుడు (పోషకుడు) కానక్కరలేదు, ఇంకో వ్యక్తి యొక్క ఆదేశము లేక ఉపదేశము లేక సాహాయ్యము ఆవశ్యకము కాదు, లేదా పూజలను ప్రార్థనలను చేసి సంపాదించిన పుణ్యము ఆవశ్యకము కాదు, లేదా ఒక విశిష్టమైన పూజ లేక యాగము ఆవశ్యకము కాదు, అగ్నియందు హోమము మొదలైన భూత సంస్కారము ఆవశ్యకము కాదు, లేదా నీవు అట్టి గొప్ప కార్యము కొరకు నడుము బిగించనక్కర లేదు. నీవు నీదైన మంచి సంస్కారముతో ఆ పనిని (దేహాభిమానమును వీడుటను) చేయాలి, నీవు చేయగలవు.

కావున, నీయందలి దైవత్వము యొక్క స్పృహయందు నీ శ్వాసను సాగనిమ్ము, అట్టి స్పృహ లేకుండా ఒక్క క్షణమైననూ గాలి పీల్చకుము. నీకు తెలిసినా తెలియపోయినా, ఇప్పటికే నీవు అదియే (పరమాత్మయే) అయి ఉన్నావు అని తెలుసుకొనుము. నీవు అట్లు చేసినచో, నీవు ఉద్దేశపూర్వకంగా విముక్తి యొక్క మార్గము నందు ఉండెదవు. నీవు విముక్తుడవు. నీవు ఆనందస్వరూపుడవు. మోక్షమందిరము యొక్క ద్వారము వద్ద నుండి నీవు ఇప్పటికే సాక్షాత్తు ఆత్మదేవుని సన్నిధి (ఆత్మదేవుని స్పృహ) లోనికి ప్రవేశపెట్టబడినావు. ఇప్పుడు నీవు అంతరతమమైన పవిత్ర స్థానము (గర్భగుడి) లోపల నిలిచియున్నావు. ఇప్పుడు నీవు పూజారివి, పూజాద్రవ్యము కూడ నీవే, మరియు సర్వాధ్యక్షుని (అధిష్ఠాన) సన్నిధివి కూడ నీవే. పూజ చేసేవాడవు నీవే, పూజించబడే దేవుడు నీవే. పావనము చేయబడినవాడవు నీవే. పావనము

చేయువాడవు కూడ నీవే. సర్వము నీవే. ఇప్పుడు నీవు ఆ ఆనందమును గురించి అబ్బుర పడుతూ సంభ్రమాశ్చర్యములతో, అతిశయించిన ఆదరముతో సరళంగా (ఈ విధంగా) గుస గుసలాడుకుంటావు. ఆహా! అది సాక్షాత్తుగా భగవానుని సన్నిధి. ఆయన తన పవిత్ర మందిరము నందు ఉండెను. కాని ఇదివరలో నాకు తెలియకుండెను. చుప్! చుప్! ఓయీ! పవిత్రత యొక్క ఏకాంతమునందు నీ సత్యసన్నిధికి జయముగాక !

ఇప్పుడు నీకు అది నీవే అని తెలిసినది. నిద్రిస్తున్నా, తెలివిగా ఉన్నా, నీవు సర్వదా సాక్షాత్తుగా ఆ దైవత్వమే అని తెలిసినది. నీవు కేవలము, సర్వదా భగవత్స్వరూపుడవే అనే సత్యజ్ఞానములోనికి నిద్ర లేస్తావు. నీవు సంతృప్తుడౌతావు. నీవు చప్పుడు లేకుండా అయిపోతావు, నిశ్శబ్ధంలో కలిసిపోతావు, ఆహా! నీలో ఒక్కడినై మేల్కాంచినప్పుడు, నేను సంతృప్తుడవుతాను. నేను నీవని తెలుసుకున్నప్పుడు, ఆహా! ఆ జ్ఞానము నందు ఏమి ఆనందము! ఆహా! అది ఎంతటి ఉజ్జ్వలమైనదో! దాని యానందము! ఆహా!

ప్రియమిత్రులారా! అది భయమును గొల్పే కల కానే కాదు, పగటి కల కూడ కాదు, మహిమాన్వితమైన దర్శనము (అనుభవము) కూడా కాదు. అది పట్టపగలు వెలుగులో ప్రకాశించే సత్యము, పూర్తిగా మేల్కాంచి ఉన్నప్పటి అనుభవము. ఈ ఏకైక సత్యమునకు అభిముఖముగా కళ్లు మూసుకుపోయిన ఇంకో క్షణము, శ్వాస నీ నుండి బయల్వెడలకుండు గాక ! ఇదే క్షణమునందు నీయందలి దైవత్వమును అనుభవమునకు తెచ్చుకొనుటకై మేల్కాంచుము ! అదియే మార్గము. *(సశేషం...)*

---

ఊరిబాట వెంబడి ఇంటింటికి బిచ్చమెత్తుతూ బయలుదేరాను. మిరుమిట్లు గొలిపే స్వప్నంవలె దూరంగా నీ బంగారు రథం కనిపించింది. ఈ రాజాధిరాజెవరా అని ఆశ్చర్యపడ్డాను.

నా ఆశ లతిశయించాయి. నా దరిద్రం తీరిపోయిందనుకున్నాను. అడక్కుండానే భిక్షం పెడతారనీ, దుమ్ములో అన్నివైపులా ధనం వెదచల్లుతారనీ, ఎదురుచూస్తోనించున్నాను. నేనున్న చోటనే నీ రథం ఆగింది. నీ చూపు నా పైన నిలిచింది. చిరునవ్వుతో రథం దిగివొచ్చి,

నన్ను సమీపించావు. ఇంకేం ఈ నాటికి నా భాగ్యం పండిందనుకున్నాను. నువ్వు తటాలున నీ కుడి చెయ్యి జాచి నా కేమిస్తావు? అని అడిగావు.

*(గీతాంజలి – రవీంద్రనాథ్ ఠాగూర్)*



# సర్వమత శాంతి సమ్మేళనం

**– *మాతా పరా విద్యానందగిరి***

---

## (ప్రసంగ పాఠం)

అన్ని మతాలలో ఉన్న ధర్మసూక్ష్మాలను విన్న తర్వాత, ఇక హిందూ ధర్మంలో ఉన్న సూక్ష్మాన్ని చెప్పవలసిన అవసరం లేదు. ఎందుకంటే హిందూ ధర్మంలో ఉన్నది కూడా అదే.

హిందూ ధర్మం సనాతనం, పురాతనం అయినది. ఏదైనా దీని నుండి పుట్టినదే. The Universal Law భగవద్గీత ప్రధానమైనది. ఆ భగవద్గీత ఎక్కడ నుండి వచ్చినది అంటే ఉపనిషత్తులు సారాంశము. ఆ ఉపనిషత్తులు ఎక్కడివి అవే వేదాలలో సారము. వేదాల్లో కాని, ఏ మతగ్రంథాల్లో కాని ఏవిధమైన బేధం లేదు. కాని క్రిందకి వచ్చేసరికి కొంత మార్పు జరుగుతున్నది. అలా కాకుండా దాన్ని జాగ్రత్తగా పరిరక్షించి ప్రచారం చేయవలసిన అవసరం వుంది. ఇక్కడ వున్న మతపెద్దల్లో ఏ ఒక్క ధర్మవాక్యంలో తేడా అనిపించలేదు.

హిందూ ధర్మం గురించి నేను సంక్షిప్తంగా చెబుతాను.

“అసతోమా సద్గమయా
తమసోమా జ్యోతిర్గమయా
మృత్యుర్మాం అమృతంగమయ
ఓం శాంతిః శాంతిః శాంతిః”

అన్ని మతాల్లో చెప్పినట్లుగా భౌతిక దుఃఖం, ఆధ్యాత్మిక దుఃఖం రెండూ వున్నాయి. “అసతోమా సద్గమయ” – అసత్తు నుండి నన్ను సన్మార్గములోనికి పంపించుము. “తమసోమా జ్యోతిర్గమయా – అంధకారం నుండి నన్ను వెలుతురులోనికి పంపించుము. “మృత్యోర్మా అమృతంగమయ” – మృత్యువు నుండి నన్ను అమృతతత్వానికి తీసుకొని పొమ్ము. ఉపనిషత్తులలో మనందరినీ ఏమని సంభోదిస్తారంటే “అమృతస్యపుత్రా” మీరందరూ కూడా అమృత స్వరూపులే ! చనిపోవడం అంటే శరీరం విడిచిపెట్టడమే. ఈ విషయంలో జంతువులకు మనకు తేదా లేదు. కాని మనకు చనిపోయినా ఆత్మ ఉంటుంది. ఎన్నో జన్మలు ఎత్తుతూ ఉంటాం. కర్మఫలం అనుభవించడానికి, మోక్షప్రాప్తి కలగాలంటే ఒక ప్రత్యేకమైన సాధన వల్లనే లభిస్తుంది. మోక్షం వస్తుందా అంటే రెండు రకాలుగా మనం తెలుసుకోవాలి. ‘అప్రాప్త ప్రాప్తః, ప్రాప్త ప్రాప్తి’ లేనిది రావడం అప్రాప్త ప్రాప్తి, ఉన్నది రావడం ప్రాప్త ప్రాప్తి. మరి

మోక్షం అనేది కొత్తగా వచ్చేది కాదు. 'నీవు సత్ చిత్ స్వరూపుడవి' త్రికాలాల్లో మారకుండా ఉండేది సత్ స్వరూపం. 'నేను ఉన్నాను' అంటే, 'ఎలా ఉన్నావు?' అన్నప్పుడు, బతికే ఉన్నాను అని ఒకరు చెప్పాలా కాని పాశ్చాత్య తత్త్వవేత్తలు.

"నేను ఆలోచిస్తాను కాబట్టి నేను ఉన్నాను" అంటారట. కాని హిందూ తత్త్వవేత్తలు. నేను ఉన్నాను కాబట్టి ఆలోచిస్తాను. ఆలోచించిన తర్వాత నువ్వు ఉండటం జరిగిందా? నీవు వున్న తర్వాత ఆలోచించడం జరిగిందా? నీవు ఉన్నావు కాబట్టి ఆలోచిస్తున్నావు. నోటికి దాహాన్ని తీర్చే స్వరూపం ఎలా ఉందో అలాగే ఆత్మకు ఆనంద స్వరూపమున్నది. సచ్చిదానంద స్వరూపమైన ఆత్మకి మోక్షం కావాలా, అవసరం లేదు. వస్తుంది, ఎప్పుడు వస్తుంది, ఎలా వస్తుంది శరీర పతనాంతరం వస్తుందా అంటే రాదు. దీనికి ఒక కథ క్లుప్తంగా చెబుతాను. ఒక మహారాజు తనకున్న రాజ్యాన్ని, అందరినీ అనగా 'నా' అను వాటిని విడిచిపెట్టి అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ ఓ కుటీరాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. తపస్సు చేసుకొంటున్నాడు. అక్కడికి ఒక బ్రహ్మచారి వచ్చి, అయ్యా! ఎందుకు ఇంత దూరం వచ్చావు. అక్కడే వుండి (నీరాజ సౌధంలో) సాధన చేసుకోవచ్చును కదా అన్నాడు. "లేదు, రాజ్యంలో నాకు మమకారం పెరుగుతుంది. 'నా' అనేది పోదు, అందుకే వచ్చేసా"నన్నాడు. అప్పుడు బ్రహ్మచారి ఈ కుటీరం ఎవరిది అనడిగాడు. 'ఇది నాదే' అన్నాడు రాజు. 'నా' ఇక్కడ ఉంది కదా అన్నాడు బ్రహ్మచారి. 'అవును నిజమే'నని రాజు కుటీరాన్ని కాల్చివేశాడు. 'ఈ ఆసనం ఎవరిది' అని బ్రహ్మచారి అడిగాడు. "నాదే" పొరపాటు అయింది అని రాజు కాలుతున్న కుటీరంలో ఆసనాన్ని విసిరేశాడు. కమండలం, జపమాల ఇవి నావే అని అన్నీ మంటల్లో వేసేశాడు. చివరికి బ్రహ్మచారి, "ఈ శరీరం ఎవరిది" అని రాజును ప్రశ్నించగా, 'నాది' అని రాజు వెంటనే ఆ మంటలో దూకటానికి వెళ్తున్నాడు. అప్పుడు ఆ బ్రహ్మచారి, అయ్యా ఒక నిమిషం ఆగు, నీవు కాలిపోతావు కదా అప్పుడు ఆ బూడిద ఎవరిది అనడిగాడు రాజు 'నాది' మరి, ఎలాగ స్వామీ, నాకు యదార్థాన్ని తెలియజేసి మోక్షమార్గం చూపండి అని అర్థించాడు రాజు. యదార్థం అనగా కామ్యకామాలను పోగొట్టుకొంటే మోక్షం అదే వస్తుంది. అమృత స్వరూపుడవుతావు అన్నాడు బ్రహ్మచారి. అయితే మోక్షం సంపాదించడానికి ఎక్కడికి పోవాలి, హిమాలయాలకా, ఇంకోచోట, మరోచోట ఎక్కడ? అనడిగాడు రాజు. అందుకు బ్రహ్మచారి, "కాదు, నీవు కూర్చున్న చోటనే వస్తుంది అన్నాడు. "ఎప్పుడు వస్తుంది?" అనడిగాడు రాజు. హృదయములో నున్న భావాలన్నింటిని పోగొట్టుకొంటేనే! మోక్షం కావాలనేది కూడా ఒక భావనే కదా, కోరికే కదా", అన్నాడు బ్రహ్మచారి. 'నిజమే' అన్నాడు రాజు. 'కాని, ఆ భావనయే మిగతా భావనలను పోగొడుతుంది, ఎలా అనగా ఒక విద్యార్థి ఫస్ట్‌క్లాసు'లో పాస్ అవ్వాలనే భావన కలిగి ఉండడం వలన అతనికి సినిమాలకు, షికార్లకు వెళ్ళాలనే భావనలను పోగొట్టింది. అలాగే, మురికిగా ఉన్న నీరు చిల్లగింజ ద్వారా శుభ్రమవుతుంది. సబ్బు మురికిని పోగొడుతుంది, తర్వాత అదీ పోతుంది.

మోక్షం కావాలనే భావన నీలో ఉన్నదే అది అప్రాప్తి కాదు. దేహభ్రాంతి వలన ప్రాపంచిక విషయాలలో పడిపోయి మరచిపోయినావు. ఇంద్రియ వ్యామోహంలో పడిపోయి ఉన్నదాన్ని మరచిపోయినావు. నిజాన్ని తెలుసుకున్నప్పుడు ఆనందాన్ని పొందుతావు. నీవు ఆనందమైన నిధివి. నీలో వున్న వ్యామోహాన్ని పోగొట్టుకుంటే సంపూర్ణ ఆనంద స్వరూపాన్ని అనుభవించవచ్చును. ఇది 'యూనివర్సల్ లా' (Universal Law) ఒక మతానికి, ప్రాంతానికి చెందినది కాదు. మరి మోక్షం ఒక్క మానవుడికేనా అంటే కాదు, పశుపక్ష్యాదులకు కూడా మోక్ష ప్రాప్తి కలుగుతుంది. గరుడపక్షి, సాలెపురుగు, పాము, ఏనుగు మొదలైనవి మోక్షాన్ని పొందాయి. అవి ఆ జ్ఞానాన్ని సంపాదించుకున్నాయి కాబట్టి.

ఇక్కడకు వచ్చిన మతపెద్దలందరూ ఆయా మత గ్రంథాలు ఏమి చెబుతున్నాయో వివరించారు. అన్ని మతాలను సమన్వయం చెయ్యాలనే మాతాజీవారు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. అలా అన్నిచోట్ల మసీదుల్లో, మందిరాల్లో, చర్చిల్లో ఏర్పాటు చేస్తే మానవ ధర్మాన్ని అందరం తెలుసుకుంటాం. ఒక ప్రశాంతమైన వాతావరణంలో అందరం జీవిస్తాము. పెద్దలందరూ ఆ ప్రయత్నాన్ని చేయాలని కోరుకొంటూ ముగిస్తున్నాను.

**సహనా వవతు సహనౌ భునక్తు**
**సహ వీర్యం కరవా వహై**
**తేజస్వినా వధీతమస్తు**
**ఓం శాంతి, శాంతి, శాంతిః**

---

సాధకుడు ముఖ్యంగా అహంకారాన్నీ నశింపజేసికొనుటకు కృషి చేయటం మంచిది. ఒక వ్యక్తి వంట వండిన తరువాత జనులకు వడ్డిస్తున్నాడు. వారు భోం చేస్తూంటే చారు ఎలా ఉంది, పాయసం ఎలా ఉంది ఇలా అడుగుతున్నాడు. బాగుంది అనే జవాబుకు ఎదురు చూస్తుంటాడు. ఇలా నేను చేసింది అనే కర్మసంగంలో పడి పతనమవుతున్నాడు. కాన కర్మను ఈశ్వరార్పాణబుద్ధితో చేస్తే అహంకారం నిర్మూలం అవుతుంది.

**– సచ్చిదానంద బోధలు**

# ప్రణవము

## (శ్రీ శాంతి ఆశ్రమం శతజయంతి ఉత్సవాల సందర్భంగా తేది. 30-11-2016న కాకినాడ శాఖలో ఇచ్చిన దివ్య సందేశము)

***- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు***

(గత సంచిక తరువాత)...

"గజేంద్ర మోక్షం" సందర్భాన్ని స్పృశించి వదిలిపెట్టాను. దేవతులు అందరూ కూడ ఈ విషయంలో అయోమయం చెందిన సందర్భం ఒకటి ఉంది.

వాడు పేరుకు గజేంద్రుడే గానీ, ఏనుగే గానీ, ఆయన ఒక పెద్ద పేచీ తీసుకొచ్చాడు దేవతలకి. ఏమిటా పేచీ? అంటే, ఆయన అసలు ఎవరి పేరూ పెట్టి పిలవలా! ఓ పేరు పెట్టి గోవిందా! అన్నాడనుకోండి, విష్ణువు వచ్చేస్తాడు. మహాదేవా! అన్నాడనుకోండి, శివుడు వచ్చేస్తాడు. సరస్వతీపతీ, వాణీపతీ, హిరణ్యగర్భా అన్నారనుకోండి! బ్రహ్మగారు వస్తారు. ఆయన ఏమీ అనలేదు. వచ్చిన గొడవ

"తస్మై నమః పరేషాయ బ్రహ్మణే ననంత శక్తియే
నమః శాంతాయ ఘోరాయ మూఢాయ గుణధర్మణే
నిర్విశేషాయ సామ్యాయ నమోధ్యానగమనాయచ
క్షేత్రజ్ఞాయ నమఃస్తుభ్యం మహాధ్యక్ష సాక్షిణే,
పురుషాయ ఆత్మమూలాయ మూల ప్రకృతయే నమః"

"విశ్వ మవిశ్వం విశ్వవేదసం విశ్వాత్మానం పరంబ్రహ్మ ప్రణతోస్మి
పరమం పదం యోగనందిచ కర్మాణో హృదయోగ్య విభావతే
యోగినోగం ప్రణశ్యంతి, యోగీశం నతోస్మ్యహం
నమో నమస్తేఖిల కారణాయ, నిష్కారణాయ అద్భుతకారణాయ
సర్వాగమన్నాయ, మహార్ణవాయ, తమోపవర్గాయ పరాయణాయ"

అని యధా తధానుసారం చేసారు పోతనగారు.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై
ఎవ్వని యందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణంబెవ్వడు
అనాది మధ్యలయుడెవ్వడు, సర్వముతానైన వాడెవ్వడు
వానినాత్మవిభౌ నే ఈశ్వరునే శరణంబు వేడెదన్"



ఎవర్ని పిలిచాడు! 33 కోట్ల మంది దేవతలు లేచి నిలబడ్డారు. నీకేమన్నా అర్ధమవుతోందా! ఎవడ్ని పిలుస్తున్నాడో అని.

"ఎవడు శాంతుడు, ఎవడు మూఢుడు, ఎవడు గుణములకు అతీతుడు, ఎవడు కర్మలకు అతీతుడు, ఎవరు జగద్రక్షకుడు, ఎవనియందు పుడుతోంది. ఎవ్వరి యందు నిలబడుతోంది, ఎవరి యందు లయమైపోతోంది, వాడు రావాలా? అని, ఎవ్వరూ రాలేదు. ఊరుకున్నారు. ఇది మనకు అన్వయమేనా? అని అడుగుతున్నది. దేనికడుగుతున్నాడో చూడండి అన్నాడు.

కాలు వెళ్లి మొసలి నోట్లో ఇరుక్కుపోయింది. రక్షించమని ప్రార్ధన చేస్తున్నాడు. రక్షించమని అడుగుతున్నాడు. కాబట్టి విష్ణువుగా వెళ్లాలి. పరబ్రహ్మ అందుకొచ్చాడు విష్ణు స్వరూపంగా, గజేంద్ర మోక్షణం 'ఓంకారము'నకు వ్యాఖ్యానం చేసింది. ఉన్న పరబ్రహ్మము నీ కోర్కెనిబట్టి రూపాన్ని పొంది వస్తోంది. విష్ణువుగా వచ్చి రక్షణ చేసాడు. అంటే సాధారణార్ధము నందు రక్షణ చేస్తాడు! అయితే మీరు నన్నొక ప్రశ్న వేయొచ్చు. బాగానే ఉంది కానండీ! అప్పుడు "పరబ్రహ్మము" యొక్క తత్త్వమేమి? మరి చంపడమన్న మాటొకటి వస్తుందిగా అందులో. శివుడూ చంపాడు, విష్ణువు చంపాడు, బ్రహ్మోగారు చంపుతున్నాడు. అదేమిటండీ బ్రహ్మోగారు ఎక్కడ చంపారు? అంటారేమీ! మీరు పుట్టినప్పుడు మీ ఆయుర్ధాయం రాసాడా? లేదా?

"లలాట లిఖితా రేఖా, పరిమాత్రం నశక్యతే" దానిని మార్చడం ఎవరి శక్యం కాదు. ఈ కోటేశ్వరరావు భూమ్మీద ఇన్నాళ్లుంటాడని రాసాడు. అన్నాళ్లేనా నేనుండాలి. అంటే నేను పుట్టినరోజుని, వెళ్ళిపోవాల్సిన రోజుని ఎవరు నిర్ణయించారు?! ఆయనేగా! పడగొడ్తున్న వాడు ఆయనకాదేంటి. ఈ సంహారము కూడా ఎలా వచ్చింది? "పరబ్రహ్మ తత్త్వము" అని అసలు పరబ్రహ్మమూ అంటే పరబ్రహ్మము యొక్క ప్రధాన లక్షణమేమి? అని మిమ్మల్నడిగా ననుకోండి! భగవంతుడిని ఎందుకు ఆశ్రయిస్తావు?, ఏమిటి భగవంతుని యొక్క లక్షణము? అని అడిగాననుకోండి. వెంటనే ఏం చెబుతారు, 'కారుణ్యము'–భగవంతునికి దయ కలదు. నేను ఇన్ని దోషములు చేసిన వాడినయినా, నా తప్పు తెలుసుకొని చెంపలేసుకొని నిలబడినా, ఆయన నన్ను అనుగ్రహిస్తారు. ఆయన కారుణ్యమూర్తి. మంచిదేనయా! నీవు అలా చెబుతున్నావు గదా! భగవంతుని యొక్క తత్త్వము నందు, 'సృష్టికర్త'గా, 'స్థితికర్త'గా, 'ప్రళయకర్త'గా అందులో కారుణ్యము లేదని చెప్పడానికి నేను ప్రభలమైన దృష్టాంతమును మీకే చూపిస్తున్నాను. చచ్చిపోయేటట్టుగా బ్రహ్మగారు చేస్తున్నారు. సృష్టి చేసి వ్యాధులు మొదలగునవి అనుభవించమని, దుఃఖాలు అనుభవించమని రాస్తున్నాడా? లేదా? దేవీ భాగవతంలో వ్యాస భగవానుడే అంటాడు.

"కాలోహి భగవాన్ కర్త, కారణం సుఖదుఃఖయోః ।
నరాణాం పరతంత్రాణాం, పుణ్యపాపాని యోగితః" ॥

గత జన్మలో చేసినటువంటి పాపపుణ్యములను దృష్టిలో పెట్టుకొని ఈ జన్మలో ఈ సుఖదుఃఖములను అనుభవించమని రాసి పంపించేస్తున్నాడు. మరి బ్రహ్మగారలా రాసి పంపించినప్పుడు, నేను ఈ దుఃఖములు పొందాలి అని రాస్తే, నన్ను కష్టపెడుతున్నాడా? లేదా? నా ఆయుర్దాయం ఇంతే ఉండాలని ఆయన నిర్ణయం చేస్తున్నాడా? లేదా? చేసినప్పుడు ఆయన కారుణ్యమూర్తి అని ఎలా చెప్పను? మరి నువ్వేగదా పాపం చేసావ్. మరి బ్రహ్మ గారికి నమస్కారం పెడతా! తీసేయ్‌మను! అంటే, తీస్తున్నాడా? 'స్థితికర్త' విష్ణువు. ఇందాకే కదా చెప్పాను. ఎంతోమందిని చంపేశారాయన అవతారములో. ఆయన కారుణ్యమూర్తి అని ఎలా చెప్పను? పరమశివుడు మహాప్రళయంలో అసలు లోకములు కూడా ఉండవు.

"లోకంబులు లోకేశులు లోకస్థులు దెగినతుదినలలోకంబగు
పెంజీకటి కవ్వల నెవ్వండేకా కృతి వెలుగునతని సేవింతున్"

"లోకములో ఉన్నవాళ్లు, లోకాన్ని పరిపాలించేవాళ్లు, ఎవ్వరూ ఏకుండగ చేసి పారేస్తున్నాడుగా మహా ప్రళయ జలధి యందు ఆయన ఒక్కడే ఉంటాడట. ఈ సమస్త జీవుల యొక్క కర్మ విశేషాలను విభూది కణాలతో పెట్టుకొని, ఒంటికి రాసుకొని, ఒక్కడే కూర్చుంటాడు"

"మేకలు వెయ్యింజనినను భాసురముగ
నొక్కపోతు వర్ణంబెక్కున్, ఆ
కోతులు వెయ్యిన్ జనినన్ ఆ కోతి నక్క
కోకోయని కూచున్" అని జానపదులు పాడతారు. అలా ఒక్కడే మిగిలిపోతాడు. అలా పరమశివుడు మహాప్రళయం చేయటలా మరి! ఆయన చేసిన పనులు బాధపెట్టడం లేదూ! మరి కారుణ్యమూర్తి భగవంతుడు యొక్క తత్త్వమేది? అంటే, "కారుణ్యమూర్తి"– "భగవత్ తత్త్వము" అని ఎలా నిర్ధారణ చేస్తారు? మీరు, ఒక్క విషయం జ్ఞాపకం పెట్టుకోండి! ఈశ్వరుడు చేసిన ప్రతి పనిలో, కారుణ్యము వినా ఇంకొకటి లేదు. మరి ఇందాక అలా ఎందుకన్నావ్? ఒక్కొక్కసారి తత్త్వం చెప్పేటప్పుడు అలా అంటే బాగా ఆలోచిస్తారు. అందుకంటాం. వ్యతిరేకత కోసం కాదు అనడం, ఏంటి ఇలా అంటున్నాడు? అంటే, బాగా ఆలోచించాలని, వ్యతిరేక కోణంలో ప్రతిపాదించడం. బ్రహ్మగారు చేసినటువంటి పనులన్నిటి యందు "కారుణ్యము"ంటుంది. ఆయన ఏం చేస్తున్నాడు? ఒక శరీరాన్ని ఇస్తున్నాడు. శరీరాన్ని



ఆయన ఇచ్చాడు కాబట్టి, నేను వచ్చి, ప్రవచనం చేసాను. ఇప్పుడీ ప్రవచనం చేయడం ద్వారా నాకు ఆయన ఇచ్చినటువంటి నోరు సార్థక్యం చెందిందా? లేదా? ఆయన నాకు మనుష్య జన్మ ఇచ్చి, నోరు ఇచ్చి, నన్ను పంపకపోతే, నేను భగవంతుని గురించి మాట్లాడకపోతే, జీవుడికి పుణ్యం ఎక్కడ నుంచి వస్తుంది? ఇక పూర్వం నేను చేసినటువంటి పాపములను ఎలా పోగొట్టుకుంటాను. శరీరం ఇచ్చి, అనుగ్రహించాడా! ఈ శరీరమునకు ఓ లక్షణమున్నది. ఇది ఝర్జరీ భూయిష్టమైపోతుంది. దీనికి వృద్ధాప్యం వచ్చేస్తుంది. అప్పుడు దానికి స్ఫురణ శక్తి వుండదు. జ్ఞాపకశక్తి ఉండదు. తిన్నది జీర్ణం కాదు. జిహ్వా చాపల్యం పెరిగిపోతుంది. సంధి బంధములు సడలిపోతాయ్. అవయవములు సహకరించవు. ఏమీ చెయ్యలేను, అయినా శిథిలమైపోయిన స్థలం దగ్గరకెళ్లి, ఇది ఫలానా బ్యారేజ్ అని పెద్ద ఫలకం పెట్టినట్టే, ఇంకా ఈ గూట్లో కూర్చుంటానని జీవడనుకొంటుంటే, ఒద్దు నాన్నా! ఇందులోంచి బయటకొచ్చేయ్! ఇంకో గూడు ఇస్తానులే! మంచి గూడు! అని విడిచిపెట్టడానికి అవకాశమిస్తూ, తేదీ రాసాడు. తప్పా! ఆయన చేసింది ఎందుకు తప్పు? ఎంత కారుణ్యమూర్తి, ఆయన అలా విడిపించక పోతే, మంచానపడి ఎన్నాళ్లు కొట్టుకుంటాడు! తన మల మూత్రములను తాను విసర్జించలేక పోతే, అంతకన్నా దారుణమైన స్థితి ఏముంటుంది ఈ లోకంలో.

"వధంచా విచ్చితా ఘోరం, తయాసారౌ పురుషస్తభ ।
విధితిచ్ఛ సహిత ధర్మజ్ఞ, శరణాగత వత్సలంః ॥" అంటుంది.

సీతమ్మ బ్రతకడం చాలా తేలిక. జీర్ణమైనంత కాలం కాస్త కుడిత తాగేసి, చిట్టు తినేసినా ఫరవాలేదు. చచ్చిపోవడం మన చేతిలో లేదు. మంచం పట్టాడా, భార్య కూడా అబ్బ ఇలా బాధపడేకన్నా అని ఒక్కమాట అనేసిందనుకోండి, బతికినట్టా? బతకనట్టా? అందుకే "అనాయాసేన మరణం, వినాదైన్యేన జీవితం", "బ్రతికినంతకాలం చేయి చాపకుండా బతకడం అనాయాసంగా శరీరాన్ని విడిచిపెట్టడం, భగవంతుని చేతిలో వుంటుంది తప్ప మన చేతిలో వుండదు". అనాయాసంగా ఈ గూడు విడిచిపెట్టి, మళ్లీ బలమైన గూట్లోకి వెళ్లి, మళ్లీ పుణ్యకర్మలను చేసుకొనే అవకాశాన్ని ఇస్తున్నాడు.

*(సశేషం...)*

# శాంతి అన్వేషణ

**- డా॥ ప్రభాకరరావు**

అన్వేషణ ప్రతి జీవిలో నిరంతరం జరుగుతూనే వుంటుంది. విలువైన రాళ్లు, రత్నాలూ, వజ్రాల కోసం ఎంతోమందికి అన్వేషణ ఒక జీవిత లక్ష్యం అవగా, ఎంతో కొద్దిమందికి మాత్రం హద్దులు, అంతం లేక ఈ విశ్వాన్ని నడిపిస్తూ మానవుడి ఊహకూ, అంచనాలకు అందని ఆ పరమాత్ముడి ప్రజ్ఞతో యోగం పొందడం ఒక ఉత్తమ పరమావధిగా వుంటుంది.

ఎందుకో భగవంతుడి కోసం ఈ తపన !

ఆనందం కోసమే ప్రతి జీవికి అలుపెరుగని ప్రయాణం. సరైన సాధన, దిశ లేని ప్రయాణంలో చివరి శ్వాస వదులుతూ తదుపరి జన్మకి బలమైన పునాది వేసుకుని మరీ శరీరాన్ని వదులుతూ వున్నాడు మానవుడు. ఇదొక సర్కస్. ఆకాశంలా దీనికి అంతం లేదు.

మానవాళికి మంచి చేసే ఉద్దేశ్యంతో వేలాది మునులు, తపస్విలు, ఋషులు ఎన్నో ఆధ్యాత్మిక ప్రక్రియల్ని ఎంతో విజ్ఞతతో రూపొందించి మనకి అందించి వెళ్లారు. మన తండ్రులు, తాతలు కూడా మనకి ఏ క్షణమైనా తరిగిపోయే కోట్లాది విలువైన ప్రాపంచిక సంపదను సమకూర్చి వాళ్ల జీవితాల్ని ధనార్జనాయజ్ఞంలో సమిధలుగా చేసి ఆవిరైపోయారు. వాళ్లెంత పేరున్న వారైనా, కోటలు కట్టించినా ప్రపంచాన్ని శాసించినా ఈ క్షణంలో వారికి విశ్వరహస్య రూపకల్పనలో ఒక చిన్న చిరునామా కూడా లేకుండా అంతర్ధానమైపోయారు. కానీ మనకి ఆధ్యాత్మిక భిక్ష పెట్టిన ఆ ఋషీశ్వరులు, భగవంతుని అన్వేషణలో మనని చేయి పట్టుకుని నడిపించే ఆ యోగీశ్వరులు మాత్రం ఎప్పుడూ మన హృదయ ఫలకం మీద నిలిచి వుండే ధృవతారలు.

ఈ భగవద్మార్గం సుగమం చేసే ఎన్నో సాదనలు... అన్నీ కూడా ప్రాణశక్తిని ఆధారం చేసుకుని తద్వారా మనోబుద్ధి చిత్తాహంకారాల్ని వశం చేసుకోవడం లేదా వాటిని అధిగమించి ఒక ద్రష్టగా మిగలడం మూలంగా వుంటుంది.

ఇందులో ప్రాణశక్తి చాలా కీలకమైనది. ఇదే విశ్వమంతా వున్నది. ఈ ప్రాణశక్తి చైతన్యంతోనే ఆకులు పచ్చగా కళకళ్లాడుతూ కనిపిస్తాయి. వికసించే పుష్పాలు దరహాసం చేస్తాయి. ఆవు దూడ చెంగున గంతేస్తుంది. పసిబిడ్డ బోసినవ్వుతో మనల్ని ఆనందంతో నింపేస్తుంది.



క్రూరుడి కత్తితో కంఠాన్ని వేయిఖండాల్ని చేసే శక్తీ ఇదే ప్రతి మనిషి చేతిలో వున్న ఒక దివ్య ఆయుధం, ఆయువు ఈ ప్రాణశక్తే.

మనోబుద్ధి చిత అహంకారాల్ని అధిగమించడం దేనికి ?

ఈ ప్రపంచంలో మన కార్యకలాపాలు నిత్యం జరుగుతూనే వుంటాయి. మన దేహ పోషణకి ఆహారం కావాలి. ఈ దేహంలో ప్రతి కణంలో నిత్యం ప్రవహిస్తూ దీనికి ఆలంబనగా వున్న ఆ పరమాత్మని తెలుసుకోవాలంటే ఒక ఆరోగ్యమైన దేహం అవసరం. నడుం వాల్చడానికి ఒక గూడు అవసరం. ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించేసే సాధకుడికి ఇవి తప్పవు. ఇందుకు మనసు నిరంతరం పనిచేస్తూనే వుంటుంది. బుద్ధి దానికి తోడౌతుంది. బంధానికీ, మోక్షానికీ రెంటికీ మనసే కారణం అని వింటూ వుంటాం.

ప్రపంచ వ్యవహారాలన్నింట్లో మమేకమయ్యే, విశ్రాంతి లేని ఈ మనసు మనల్ని నడిపించే శక్తి అయితే మనకు వేయి జన్మలైనా సరిపోవు. జన్మ తర్వాత జన్మ తీసుకునే ప్రవాహంలో మనిషి ఆది నుండీ అలసిపోతూనే మళ్లీ సంస్కార బీజంతో మొలకెత్తుతూనే వున్నాడు. భగవంతుడికే మనల్ని పుట్టించే శక్తి సూక్ష్మాతి సూక్ష్మమై ప్రళయాంతంలో వినాశనం రావాలి తప్ప మనిషికి కనువిప్పు వస్తుందా?

ఈ మనసే ప్రపంచంలో భ్రాంతిని కల్పించే అన్ని రూపాలకూ, రుచులకూ, అందాలకు కారణం. కామం, క్రోధం, లోభం, మదం, మాత్సర్యం – ఈ రూపాల్ని పొందేది ఈ మనసే. వేలాదిగా మనసులో వచ్చే ఈ చిత్ర కల్పనలకు ఇంధనం లేకుండా వ్యవహారం జరుగదు. సినిమా తెరపై బొమ్మ కనిపించడానికి ఇంధనంగా విద్యుచ్ఛక్తి ఎలా వుంటుందో, చిత్తం తెరపై ఎప్పుడూ ఆడే బొమ్మే ఈ మనసు.

చిల్లికుండలో నీరు ఎంత పోసినా వ్యర్థం అయినట్లు ప్రాణశక్తి ఈ మానసిక ఆటలో మనకు అంతుచిక్కని అయోమయంలో, అజ్ఞానంలో వ్యర్థం అవుతూనే వుంటుంది.

ఒక రూపాయి సంపాదించాలన్నా విలువ కట్టలేని ఈ ప్రాణశక్తి ఎలా వ్యర్థం అవుతుందో భగవంతుని తెలుసుకోవాలన్నా, ఆ విశ్వ విధాత పరమాత్మ, ఆ విశ్వ శక్తితో యోగం పొందాలన్నా ఈ ప్రాణశక్తే అవసరం.

ప్రాణం లేని శవం దేవుని తెలుసుకోలేదు కదా. శరీరంలో ప్రాణం వుండగనే అంటే ఈ జన్మలోనే తుదిశ్వాస వదిలే లోపునే మన మూలాల్ని కనుగొంటే, మన అసలైన ఆస్తిని పొందగలిగితే, మన జన్మహక్కుని కాపాడుకోగలిగితే ఈ జన్మ ధన్యమైనట్లే.

జేబులోంచి ఒక రూపాయి నాణెం క్రింద పడితే మరీ వెతికి, వెతికి జేబులో వేసుకుంటాం. ఆకలిగావున్న వాడికి ఒక రూపాయి ఇస్తే మన ఆస్తిలో ఆ రూపాయి తరిగి పోతుందనే పిసినారులం మనం. చిరిగిపోయే ఈ “రూపాయి కాగితం” గురించి మన బుద్ధిని ఎంత విజ్ఞతతో వాడుతున్నాం !

విశ్వమాత ఈ విలువ కట్టలేని ప్రాణశక్తిని ఊరికే ఇచ్చింది కదా! దీని విలువ మనకు తెలియదు. ఈ శక్తికి విచ్చలవిడిగా ఖర్చుపెట్టి పీకలదాకా వచ్చే పిండి వంటలలో దీన్ని ఏ రోజుకారోజు పూడ్చుకుని మళ్లీ మనిషి ఈ రూపాయి అన్వేషణలో అహంకార వీరంగంలో తలమునకలవుతాడు.

పతంజలి మహర్షి ప్రపంచానికి అందించిన అమూల్య అష్టాంగ యోగం మన పాఠ్యాంశాల్లో వుంటే ఎంతో బావుండేది. యోగి చెప్పిన నియమనియమాలు పాటించితేనే తప్ప చిత్త దాని బలమైన సంస్కారాల్ని వదిలి ఆనంద స్వరూపమైన కైవల్యంలోకి లీనమవదు.

ప్రాణశక్తీ, మనసూ – ఈ రెండూ ఎప్పుడు అనుసంధానంలో వుంటాయి. మనసెక్కడ కేంద్రీకరింపబడుతుందో ప్రాణశక్తి (శరీరంలోనూ, విశ్వంలోనూ వుండే శక్తి) అక్కడ ప్రవహించి, మనసులో కోర్కె సిద్ధించేలా చేస్తుంది. ఇది విశ్వరహస్య, విశ్వప్రణాళిక, సత్యం.

మనోచలనానికి ప్రాణశక్తి కొవ్వొత్తిలా ఎప్పుడూ ధారని అందిస్తూనే వుంటుంది. ఈ చంచల ప్రాణం ఆధారం చేసుకుని ఈ చంచల మనోశక్తితో మనం ఇంకో అలగ్జాండరవ వచ్చు లేదా ఇంకో తుగ్లక్ చక్రవర్తి అవవచ్చు. ఎన్నో సంపదల్ని సంపాదించవచ్చు. కానీ చంచల మనసుతో మన అసలు సంపదనూ, మన అసలు రూపాన్నీ అంతులేని నిత్య ఆనందాన్నీ పొందలేం. ఈ మానసిక చంచలత్వాన్నీ, చిత్తంలోని విరామం లేని ఈ రూపాంతరాల్ని రూపుమాపే సాధనే యోగీశ్వరులు మనకిచ్చిన **ప్రాణాయామం :**

మనసు ఆసక్తికర వస్తువుగా తయారవకుండా ఎలా చేయగలం? ప్రాణశక్తిని అందించకుండా వుంటే మనసుకు ఆహారం అందనట్లే. ప్రాణాయామంలో ప్రాణశక్తికి సంకల్పించి మూలాధారం నుండి వెన్నునాడిలో వున్న అన్ని చక్రాల్నీ స్పర్శిస్తూ, భ్రూమధ్యంలో గానీ, సహస్రారంలో గానీ నిలపడం అనేది ఒక గుప్త సాధన. ఇది గురువు నుండి అభ్యసించే ఒక దివ్యయోగ సాధన. జంతువు నుండి మనిషిని చేసే ఒక అద్భుత ప్రక్రియ. మదించిన యేనుగు లాంటి మనసుని అదుపులో పెట్టే మావటి శక్తే ఈ ప్రాణాయామం.

ఊరికే వచ్చిన వస్తువు విలువ తెలియదంటారు. ఈ ప్రాణం విలువ తెలిసినవాడు



ధన్యుడు. ఈ ప్రాణం వుండగానే వందతరాలకి సరిపడే ఆస్తుల్ని పోగేద్దాం అనుకునేవాడు బుద్ధిహీనుడు. ఈ మానసిక జబ్బుకి వైద్యం లేదు.

ఈ ప్రాణం వుండగానే, ఈ మనసంటే ఏమిటి? నేను ఈ శరీరాన్నా, మనసునా, ఇప్పటిదాకా నా గురించి నేననుకున్న ఈ ఆకారం (అహంకారం) అసలు నాదేనా... అనే సూక్ష్మమైన ఆలోనలు, గురువు, భగవంతుడి కృప వలన మన మనోఫలకంపైన నిరంతరం కదిలాడుతూ వుంటే ఎప్పటికైనా ఆ విశ్వకర్త మనల్ని తనలో లీనం చేసుకోక తప్పదు. అప్పుడే ఈ జన్మ సార్ధకమవుతుంది.

ఇదేదో ప్రాణం విడిచినతర్వాత పొందే యోగం కాదు. ప్రాణం వుండగానే, ప్రాణశక్తి అతిసూక్ష్మమై మనోచిత్తాల్ని ఇంకా సూక్ష్మం చేసి, అహంకారాన్ని నాశనం చేసి, మనం ఒక ద్రష్ట (witness) గా మారే ఒక అద్భుతమైన ఎరుక (awareness)తో కూడిన ప్రజ్ఞ. ఈ ప్రజ్ఞే భగవంతుడు మనకి తెలియకుండా నిత్యం మనం కోరుకునే బ్రహ్మానందం ఇదే.

అదే మనం. అదే మన గమ్యం.
అందుకే మన అన్వేషణ.


**శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి !**

- శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.
- సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే). M.O. ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.
- M.O. ఫారంలో దిగువ For Communication భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.
- చందా కాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొంటే మంచిది.
- అడ్రసు మార్పును ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి.
- చందా వివరములు తెలుపని యెడల సొమ్మును విరాళముగా జమ చేయబడును.

**కార్యదర్శి, శాంతి ఆశ్రమం (PO)**
వయా శంఖవరం-533 446, తూ॥గో॥ జిల్లా.

# ఉపదేశ సారము

**- వినతి**

శ్రీ రమణ మహర్షి ఉపనిషత్తుల సారాన్ని "ఉపదేశసారము" ద్వారా అందించారు. మురుగనార్ అనే ఒక తమిళ కవి పరమేశ్వరుడు మునులకు చెప్పిన ఆత్మవిచారణ ఏదైతే వుందో అది ఆయన గ్రహించి శ్రీ రమణ భగవాన్ ద్వారా ప్రకటీకరణ చేశారు. మరి పరమేశ్వరుడు ఋషులకు ఈ విషయం చెప్పడానికి కారణం ఏంటి? దారుకావనంలో మునులు కామ్యకర్మ కాండలతో మునిగిపోయి వున్నారు. అక్కడకు పరమశివుడు ఒక సుందరమైన రూపంలో యాగశాలలోనికి ప్రవేశించారు. ఆ రూపానికి ఆకర్షితులై ఆ మునిపత్నులు ఆయన వెంట వెళ్ళిపోయారు. తరువాత మునుల యోగసిద్ధితో పరమశివుని మీద శిద్ధులను ప్రయోగించారు. పరమశివుడు వాటన్నిటిని ఎదుర్కొని తర్వాత తన సహజ సుందర రూపమైన పులిచర్మధారుడై ప్రత్యక్షం అయ్యాడు. ఈ కామ్యకర్మల వలన బంధం కలుగుతుందే కానీ, ఆత్మసుఖం కలుగదు అని బోధ చేస్తారు. దీన్ని తమిళంలో "ఉపదేశ వుండియార్" అంటారు. ఇది సాధువుల విక్రియ చంధస్సులో సాగుతుంది.

కర్మ, భక్తి, యోగ, ధ్యాన, జ్ఞాన మార్గములు అన్నియూ ఇందులో తెలుపబడినవి. భగవద్గీత, శంకరభాష్యాలు, ఉపనిషత్తులు ఏవైతే ఉన్నాయో అన్నింటి సారంను సరళంగా, మధురంగా వినిపించటంలో రమణ మహర్షికి సాటి మరొకరు లేరనిపిస్తుంది. ఈ ఉపదేశ సారములో చెట్టుకు సారం ఫలం. గోవుకు సారం క్షీరం. ఉపనిషత్తుల సారం "ఉపదేశ సారం". సృష్టిలో మానవుడు బుద్ధిబలం వలన ప్రకృతినంతా తన వశంలో పెట్టుకోగలడు. ధ్యానం మనసు ద్వారా చేస్తాము. భగవంతుడిని ఈ మనస్సు ద్వారా ధ్యానం చేస్తే బుద్ధిశక్తి అనేది ప్రసాదించడం జరిగింది. ప్రతి వస్తువు తన సహజ స్వభావ స్థితిలో వుంటుంది, లేదంటే పొందడానికి ప్రయత్నం చేస్తుంది. అలాగే మానవుడు కూడా తన సహజ స్థితి అయిన ఆనందమును పొందడానికి ప్రయత్నం చేస్తాడు. ఉపదేశసారము ఏమి చెబుతుందంటే ఈ దేహంతో తాదాప్యం చెందకపోవడమే మోక్షము అని. దాన్నే బౌద్ధులు నిర్వాణము అని, వైష్ణవులు వైకుంఠము అని, శివభక్తులు కైలాసము అని అన్నారు.

కేనోపనిషత్తు సారమే ఉపదేశ సారములో ఉంది. మన శాంతి ప్రార్ధన కూడా కేనోపనిషత్తు సారమే! "కేనేషితం ప్రేషితం మనః" ఎవరిచేతనైతే ఈ ప్రాణశక్తి నడుపబడుతుందో, ఎవరిచేతనైతే చూడబడుతుందో, వినబడుతుందో ఆ శక్తే నీవు. భగవద్గీతలో "ఆర్తో జిజ్ఞాసు





అర్థార్థి భక్తీచ జ్ఞానీచ భరతర్షభ!" అన్నారు. నాలుగు రకాలైన భక్తులు వుంటారు. మొదటి రకంవారు ఆర్తులు. దుఃఖం కలిగినప్పుడు భగవంతుని ప్రార్ధన చేస్తారు. దుఃఖం సమసిపోగానే భగవంతుడిని మర్చిపోతారు. రెండవ రకంవారు అర్థార్థి అంటే మన శాస్త్రంలో చెప్పబడి వున్నది ధనం కోసం, భోగాల కోసం ఇతరుల యొక్క సొమ్ముమీద ఆధారపడకుండా భగవంతుడిని ప్రార్థించు ఆయనే ఇస్తారు అని! అంటే కామ్య కర్మలు సూచించబడి వున్నాయి. మూడవ రకంవారు జ్ఞాని. ఆయనకు ఏమీ అంటవు. అంతా భగవత్ స్వరూపంగా భావిస్తాడు. నాలుగవ రకం జిజ్ఞాసు. అంటే విజ్ఞాని అన్నమాట. ఈ సూర్యుడిని నడిపించేది ఎవరు, ఈ భూమిని నడిపించేది ఎవరు అని ఉన్నతమైన విషయాలను గూర్చి ఆలోచించేవాడు. అన్నిటికి వెనుకనున్న అసలు పరమ సత్యంను గ్రహించేవాడు. సత్యం పునాదిగా తపస్సు, నిష్కామ కర్మ చేసినప్పుడు అది అర్థం అవుతుంది. ఉదా॥ నాకు ఇది తెలుసు అంటారు. అది తెలియదు అంటాము. ఈ రెండింటికి సాక్షీభూతంగా ఏ శక్తి అయితే వుందో అదే "నీవు". ఈ విషయాలు కేవలం చదివితే మనకు అర్థం కావు, గురువు ద్వారా మాత్రమే తెలుసుకోబడుతుంది.

శ్రీరామకృష్ణుని తత్వాన్ని వివేకానందుల స్వామి ఎలా విశ్వవ్యాపకం చేశారో, అదే విధంగా కావ్యకంఠ గణపతిముని రమణుని యొక్క సందేశాన్ని విశ్వవ్యాపితం చేశారు. ఇక్కడ కేవలం పరతత్వం గురించి మాత్రమే చెప్పారు. ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదు అన్నిమతాలకు సంబంధించిన పరతత్వం గురించి చెప్పారు. భగవద్గీతలో అన్నట్లు "మద్గత్వా తద్ధామ పరమం మమ" ఏ స్థితినైతే పొందితే మళ్ళీ తిరిగిరారో ఆ స్థితిని గురించి ఇక్కడ చెబుతారు.

ఈ సృష్టియొక్క ఫలం కర్మ. పరమాత్మ యొక్క ఆజ్ఞ వలనే అన్ని కర్మలు జరుగు తున్నాయి. కాని కర్మలు జడం, భగవంతుడి శక్తి లేకుండా ఏ కర్మ చేయలేము. అలాగే ఈ కర్మలు దేహాన్ని, బుద్ధిని, ఆత్మను ఆశ్రయించుకొని వుండవు. గుణాలను ఆశ్రయించుకొని వుంటాయి. శ్రీకృష్ణుడు అంటాడు అన్నీ నాలో వున్నాయి. కాని నేను వాటిల్లో లేను అని. భగవంతుడికి గుణాలతో తాదాప్యం లేదు. కేవలం సాక్షీభూతంగా వుంటాడు. ఉదా॥ దీపపు వెలుగులో దొంగతనం చేయవచ్చు. జూదం ఆడవచ్చు. భాగవతము చదువవచ్చు. భగవంతుడనే దీపపు వెలుగుకి వీటితో ఏమి సంబంధం వుండదు. కేవలం సాక్షీభూతంగా వుంటుంది. కర్మ పరమైనదాన్ని అందుకోలేదు. అలాగని కర్మలను చేయడం మానేస్తామా? అలాగ కూడ జరుగకూడదు. కర్మఫలాన్ని ఈశ్వరార్పణ భావంతో చేయాలి.

# మధుకైటభుల సంహారం

**- డా॥ కె. వెంకట శివయ్య, I.A.S (Rtd.)**

విష్ణుమూర్తి 5,000 సం॥లు మధుకైటబులతో యుద్ధం చేసి అలసిపోతాడు. కారణం మధుకైటబులు ఒక్కొక్కరే విష్ణువుతో యుద్ధం చేస్తున్నారు. ఒకరు యుద్ధం చేసేటప్పుడు మరొకరు విశ్రాంతి తీసుకుంటున్నారు. కాని విష్ణుమర్తి మాత్రం ఏకధాటిగా యుద్ధం చేస్తున్నాడు. అలసినవారితో యుద్ధం చేయరాదు అన్న యుద్ధనీతిని అనుసరించి మధుకైటబులు విష్ణువును విశ్రాంతి తీసుకొనుడు అని పలికెను. అప్పుడు ఒకవైపు విష్ణువు, మరోవైపు మధుకైటబులు విశ్రాంతి తీసుకుంటూ గెలవడానికి ఉపాయాన్ని వెతుకుతున్నారు. అప్పుడు విష్ణుమూర్తి పరాశక్తిని వేడుకొనెను. పరాశక్తి ఉపాయాన్ని స్ఫురింపజేస్తుంది. అప్పుడు శ్రీహరి మధుకైటబులతో "మీ శక్తికి మెచ్చాను, మీకు ఏదైన వరం కావాలంటే కోరుకోండి" అనెను. అప్పుడు మధుకైటబులు అహంకారంతో, "నీవేంటి మాకు వరం ఇచ్చేది? మేమే నీకు వరం ఇస్తాము. ఏమి కావాలో కోరుకో" అనెను. అప్పుడు వెంటనే శ్రీహరి, "మీరు నా చేత సంహరింపబడాలి" ఆ వరం నాకు ప్రసాదించమనెను. అప్పుడు మధుకైటబులు ఆశ్చర్యపడి, సరే ముందు నీవు మాకు వరం ఇస్తానన్నావు కాబట్టి ముందు నీవు మాకు ఒక వరం ఇవ్వు. తర్వాత నీకు మేము ఇస్తామన్న వరం ఇస్తాము అనెను. అప్పుడు మధుకైటబులు హరిని వరం అడిగెను. "నీ దేహం అనంతమైన సాగరంలా ఉంది. అందులో జలం లేని ప్రదేశంలో మమ్ము చంపుము".

అప్పుడు క్షీర సాగరంలో వున్న విష్ణువు అమ్మవారిని ప్రార్థించి మెల్లగా తన శరీరాన్ని పెంచడం ప్రారంభిస్తాడు. అది చూచి మధుకైటబులు కూడా వారి శరీరాలను పెద్దవి చేస్తారు. తరువాత అమ్మవారు ప్రత్యక్షంగా అక్కడికి వచ్చి ఉపస్థితులవుతారు. విష్ణుమూర్తి శరీరం అనంతంగా పెంచేశాడు అమ్మవారి అనుగ్రహంతో. అప్పుడు ఆయన తొడల మీద నీరు ఉండదు. మధుకైటబులు వారి శిరస్సులను విష్ణువు తొడల మీద ఉంచుతారు ఓటమికి చిహ్నంగా. అప్పుడు విష్ణువు తన చక్రంతో వారివారి శిరస్సులను ఖండిస్తాడు. ఆ విధంగా శక్తి లేనిదే ఏది సాధ్యం కాదు ఈ సృష్టిలో. అంతా నిర్జీవమే అవుతుంది.



# కైవల్యోపనిషత్

**- స్వామిని శృతానంద**

కర్మచేత గాని, సంతానముచేత గాని, ధనముచేత గాని కాక కేవలం త్యాగం ద్వారానే అమృతత్వం పొందగలరు. స్వర్గమునకు పరమై, హృదయ గుహలో ప్రకాశిస్తున్న ఆ పరమాత్మను ఆత్మసంయమనంగల యతీశ్వరులు చేరగలరు. ఇక్కడ శరీర మనోబుద్ధులతో తాదాత్మ్యం వదులుకోవాలి. ఇక్కడ త్యాగం అంటే ఈశ్వరుడు. నేను వేరు అనే జీవభావాన్ని త్యజించాలి. అప్పుడే అమృతత్వాన్ని అందుకోగలము.

పరిశుద్ధమైన అంతఃకరణములగలవారై, సన్యాస యోగము ద్వారా వేదాంత విషయములను విజ్ఞానముచేత విశదంగా తెలుసుకొని నిశ్చితార్థులైన యతీశ్వరులు అందరు బ్రహ్మ ప్రళయ కాలం వరకు బ్రహ్మలోకమందు ఉండి పరాన్తకాలమందు విముక్తులై ఆ అమృతత్వ స్థితిని అందుకొంటున్నారు.

పై రెండు మంత్రాలు సాధారణంగా మనం గురువులను పూర్ణకుంభంతో ఆహ్వానిస్తున్నప్పుడు కూడా పలుకుతాము.

ఇక సాధన ఎలా చేయాలి అంటే, ఏకాంత ప్రదేశమందు సుఖాసనాసీనుడై, మెడ, శిరస్సు, శరీరములను తిన్నగా, సమంగా నిలిపి, శుచియై, సన్యాసభావంతో సమస్త ఇంద్రియాలను నిరోధించి, భక్తితో తన గురువుకు మనస్సుతో నమస్కరించి, ఫలిత్ పుండరీక మధ్యంలో నిర్మలనము విశదము అయిన ఆ పరమాత్మను ధ్యానించు అచింత్యము, అవ్యక్తము, అనంతమైన రూపముగలది. శుభకరమైనది, ప్రశాంతము, అమృత రూపము, బ్రహ్మకు కూడా కారణమైనది. అది మధ్యాంత రహితము, ఏకము, సర్వవ్యాపి చిదానందము, అపురూపము, అద్భుతము అని 13 విశేషణలతో పరమ సత్యరూపమైన పరమాత్మతత్వాన్ని హృదయ కుహరంలో ధ్యానించు. ఇక్కడ నిర్గుణ బ్రహ్మపై ధ్యానించి బుద్ధి సూక్ష్మత అలవరచుకోవలసి వున్నది.

భగవంతుడ్ని నిర్గుణ బ్రహ్మగాను, సుగుణ బ్రహ్మగాను ధ్యానించవచ్చు. రెండు విధానాల యొక్క లక్ష్యం ఒక్కటే. అదే ఆత్మసాక్షాత్కారము. సుగుణ బ్రహ్మ ఉపాసనలో పరమాత్మ ఊహతో కూడినవాడు (ఆకృతి), ప్రభువు, ప్రశాంతుడు, త్రిలోచనుడు, నీలకంఠుడు

అయిన పరమేశ్వరుని ధ్యానించి, ముని అయినవాడు ప్రాపంచ సృష్టికి కారణమై పెనుచీకటి ఆవల వుండి ఆ సర్వసాక్షిని చేరుచున్నాడు.

భావనా అద్వైత్వం సదా కుర్వాత్. క్రియా అద్వైతం న కుర్యాత్. అద్వైత భావన సదా మన భావనలో వుండాలి. అంతేగాని అంతా పరమాత్మే అని విచ్చలవిడిగా క్రియలు చేయకూడదు. ఉదా॥ దుష్ట మృగాల్ని చూచినా, దుష్టుడ్ని చూచినా వెంటనే మన భావము మాత్రం భగవంతుడా నీవు ఈ రూపంలో వున్నావా? అన్న భావన కలగాలి. అంతేగాని వాటిని సమీపించి వాటి దుష్ప్రభావానికి లోను కాకూడదు. శివుడ్ని త్రిలోచనుడు అంటున్నాము. రెండు కండ్లు చర్మచక్షువులు అవి ప్రేమ, క్రమశిక్షణను సూచిస్తున్నాయి. మూడవ నేత్రం జ్ఞానచక్షువు అది జ్ఞానాన్ని సూచిస్తున్నది. నీలకంఠుడు అంటే శివానందస్వామి చెపుతారు. "అవమానాలను, బాధలను దెబ్బలను జేబులో వేసుకొని వెళ్ళిపోతూ వుండాలి" అద్దమెలా తనముందున్న ప్రతిబింబాన్ని యదావిధిగా చూపిస్తుందో అలాగే వేదాంతం మనల్ని మనం తెలుసుకోవడానికి  ఉపయోగపడుతుంది.

ఆ పరమాత్మే బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు. అతడు నాశనము లేనివాడు. పరమ స్వరాట్, అతడే విష్ణువు. అతడు ప్రాణము, కాలము, అగ్ని, చంద్రుడు కూడ అయివున్నాడు. భూతకాలము నందు ఏది ఉండెనో, భవిష్యత్ కాలమందు ఏది ఉండగలదో, అది ఆ పరమాత్మే. ఆ పరమాత్మ సనాతనమైనది. అట్టి నిత్యతత్త్వమైన పరమాత్మను తెలుసుకొని మృత్యువును అధిగమిస్తున్నాడు. ముక్తికి ఇంతకంటే మరొక మార్గం లేదు. జీవాత్మ భావమును క్రింది అరణి గాను, ప్రణవమును ఉత్తరారణిగాను చేసి జ్ఞానమార్గము యందు మధించి అభ్యాసము చేసిన పండితుడు (ధారణ, ధ్యానము ద్వారా)కి దానిలో నిప్పులు ఏర్పడి అగ్ని ఉద్భవించినట్లు, అజ్ఞానము నశించి జ్ఞానము తనకుతానుగా బుద్ధిలో వ్యక్తమగును.

తర్వాత ఆ ఆత్మే మాయామోషితమైన ఈ శరీరములో ప్రవేశించి జీవుడుగా సమస్త కార్యములను చేయుచున్నది. జాగ్రద్వస్థలో ఆ జీవుడే స్త్రీ, అన్న పానాది విచిత్రమైన వివిధ భోగములను అనుభవించ సంతృప్తిని పొందుచున్నాడు. ఆ జీవుడే స్వప్నమందు తన మాయలో కల్పించుకున్న జీవలోకములో సుఖదుఃఖాలను అనుభవించుచున్నాడు. సుషుప్త అవస్థలో సర్వము విలీనమైనప్పుడు తమస్సుచే ఆవరింపబడి సుఖరూపంలో ఉంటున్నాడు.



# వెలుగు

**- సిలువేరు సుదర్శన్**

సాధనలో మునిగతే మనిషి మనసు ఆనందంతో నిండుతుంది. సాధన గావిస్తున్న మనం సంతృప్తి చెందకపోతే లోపముందని గ్రహంచాలి. ఇవి అనివార్యాలు కావు. దానికి అనుగుణంగా మనం జీవించిన అమృత ఫలాన్ని అందుకోగలము.

మనస్సు ఎంత ఆలోచించినా దానికి మించి అది చూడలేదు. పరమాత్మ దివ్యదృష్టి, మనస్సు అందుకోలేని ఆ స్థితిని శాస్త్రం మన ముందు ఉంచుతుంది. నా చూపులో ఉన్నది పరమాత్మ చూపులో ఉండదు. అనగా రాగద్వేషాలు లేకుండా చూస్తాడు.

రాగద్వేషాల నుండి విడివడిన మనము, బాహ్య విషయాల్లో చర్చిస్తూ ఉండిన, మన మనస్సును నిగ్రహించుకుని అధీనంలో ఉంచుకొని ప్రశాంతతను పొందగలము. ఈ రాగద్వేషాలు ఎవరికి సుఖశాంతులను ఇవ్వవు. ఎంతోకాలంగా ప్రేమించిన వ్యక్తులను ద్వేషించడానికి, బంధాలను విడగొట్టుకోవడానకి ఇవియే కారణమవుతున్నవి.

భగవంతుడు లేడు అనే నాస్తికుడికి వాడి మనస్సే ఆధారం, శాస్త్రమా? కాదు. జీవితంలో ప్రతిక్షణం పోగొట్టుకోవడానికి అలవాటుపడ్డాము. రాబట్టుకునే రోజులు ఉంటాయో చెప్పనలవి కాదు. రాగద్వేషాలు లేకుండా భగవంతుడు చూస్తాడు అని నిర్ధారణకు వచ్చాం. దీనితో లోక కళ్యాణానికి నాంది ఏర్పడింది. అందుకే ఆయన పరమాత్మ అయ్యాడు.

అందరికీ జీవితముంది. చైతన్యం ఒక్కటే. పరమాత్మ లోక కళ్యాణమే చేయును. దీనికి ధనం, పలుకుబడి, జనం ఏమీ అవసరం లేదు. "సర్వేజనాః సుఖినోభవంతు" అని దణ్ణం పెట్టడానికి ఏమి అవసరం లేదు. హృదయంలో ఒక దివ్యమైన వెలుగు వెలుగుతూ ఉంది. ఈ సత్యాన్ని గుర్తించడానికి మనం ఎదగాల్సి వుంది.

లోక కళ్యాణం జరిగితేనే వ్యక్తి కళ్యాణం. పదిమందిని సుఖపెట్టడానికి మానసిక వనరులు మనవద్ద కలవు. కావలసింది సంస్కారం కాబట్టి సంస్కారాన్ని సరిదిద్దుకునే కార్యక్రమం చేపట్టాలి. రాగద్వేషాలు లేకుండా ప్రపంచాన్ని చూడాలి. కాయకకర్మలలో గాని, వాచ కార్మలో గాని మానస కర్మలో గాని ఒక దివ్యమైన స్థితిని తయారుచేసుకున్నా మనలో సాధన జరుగుతున్నదని  గ్రహించాలి.

ఉన్నదానిని ఉన్నట్లుగా చూస్తూ, యదార్థాన్ని గ్రహిస్తూ పోవడములోనే సుఖమున్నది. లోక కళ్యాణములోనే మన కళ్యాణము గలదని, ఆలోచనలు, మాటలు, కర్మలు నడస్తుండాలి. లోకకళ్యాణార్ధం కర్మలు చేస్తూ, ఇతరులను నొప్పించే కర్మలను త్యజించడమే మంచిది

ఎందుకని? నొప్పించే పరిస్థితి పరమాత్మ కల్పించాడు, తాను చేసే పనులు ఇతరులను నొప్పించకుండా చేయును.

పరమాత్మ అనంత సహనంతో ఉంటాడు. ఈ రోజు నేను ఏ తప్పు చేయలేదు. నాకీ విధమైనకష్టం వచ్చింది. భరించలేని బాధ నాకు రాదగింది కాదు, నా జీవితం అలాంటిది కాదంటాము. నిజమే, కాగడా పెట్టి వెతికినా దోషం ఈ రోజు కనిపించదు. కాబట్టి రాగూడనిది ఎప్పుడు రాదు, రాదగింది కనుకనే వచ్చింది. ఈ ఫలితాలు పరమాత్ముని చట్టాలు. శిరసా, మనసా, వాచా వాటిని అంగీకరించి తీరాలి. కర్మఫలితాలకు దూరంగా పరిగెత్తలేము, భగవంతుడిచ్చే ఫలితాన్ని ప్రసాదంగా భావించాలి. అనంత సహనంతో అంగీకరించాలి. ముందుగా ఊహించడానికి అనువు గాని దానినే జీవితం అంటారు.

ప్రయత్నాలు మనకు తెలుసు, ఫలితాలు తెలియవు. ఇవన్నీ ఉండేది బాధపడడానికి కాదు, బోధపడేలా మనస్సుకు అర్థం చేసుకోవటానికి, ఆవేదన చెంది సాధించేదేమి వుండదు. రాగద్వేషాలు లేకుండా చూసే శక్తినివ్వమని భగవంతుని ప్రార్థిస్తుండాలి. మన కర్మలు, వాక్కులు, ఆలోచనలు లోక కళ్యాణార్థం సాగేలా ఆశీర్వదించమని వేడుకోవాలి. వ్యక్తిగత జీవితాలు మనవి కావు. ఇతరులతో ముడిపడకుండా మన జీవితాలు లేవు. నోటికొచ్చిందల్లా మాట్లాడినా అది సంతగోలే అవును. ఎవరి మనస్సులో అయితే రాగద్వేషాలు ఉండవో వారు ఉండే ఇళ్ళు గృహాలు కావు, శాంతినిలయాలై వెలుస్తాయి.

ఇంట్లోగాని, బయట గాని ఇతరులను నొప్పించకుండ మనము కర్మలను చేస్తూ ఉండాలి. నా దేహం మీద కూడా నాకు హక్కు లేదు. దానిని కష్టపెట్టే హక్కు కూడా నాకు లేదు. దేహం నేను కాదు, మన దేహాలకు భిన్నమైనవాళ్ళము మనము. మన దేహాలని మనము నిలుపలేము. ఒప్పులు చేసే సామర్థ్యం మాకు లేనేలేదు. ఈ తప్పుల నుండి విడి వడడానికి ప్రయత్నం చేసే శక్తిని ప్రసాదించమని భగవంతుని వేడుకోవాలి.

వీటికి సంబంధించినదే జ్ఞానం. జ్ఞానం లేని కర్మల్లో ఏమున్నాయి, రాగద్వేషాలు తప్ప. జ్ఞానం కలిగిన తర్వాత పొందేందుకు ఉత్సాహంతో ప్రయత్నించడం నిరంతర ప్రయత్నంలో నిరంతర తృప్తి–ఇదే కర్మయోగం. ఏం పొందాలో తెలుసుకోవడం జ్ఞానం పొందెందుకు ప్రయత్నించడమే కర్మయోగం. ఇవియున్న యెడల పరమాత్మకు, మనకు దూరము ఉండదు.

ఈ దేహం క్షేత్రం. దీనిలో పాప ప్రక్షాళన జరగాలి. పశ్చాత్తాపం కలగాలి. ఉన్న దానిని ఉన్నట్లుగా అంగీకరించే మనస్తత్వం కదలాలి.

సుగుణ ఫలాలను ఈ దేహంలో తయారుచేసుకోవాలి. మోక్షఫలాలను పండించు



కోవాలి. లోక కళ్యాణ సత్కర్మల్ని ఆచరిస్తూ వుండాలి. మన మనస్సులను శుద్ధి చేసుకునే బాధ్యత మనపైనే కలదు. జ్ఞానకర్మలు రెండునూ మనలోకి రావాలి.

ముందు జ్ఞానం వెనుక కర్మయోగం. ఈ క్షేత్రంలో దారి చూపే జ్ఞానము ముందు ఉండాలి. కర్మయోగం వెనుకుండాలి. కాబట్టి దృఢమైన చెదరని నీతి కావాలి. కాలంతో గాని, పరిస్థితులలో గాని, ఏ నీతి, ఏ ధర్మమైతే చెదరకుండా ఉంటుందో అదే నీతి, అదే ధర్మం. పట్టుకొని వదలిపెట్టేవి ఈ ప్రపంచంలో చాలా ఉన్నాయి. పట్టుకున్నప్పుడు అవి చేజిక్కినట్లే ఉంటాయి. పోకుండా ఉండేది ఏదో దాన్ని వెతికి పట్టుకోవాలి.

పట్టుకున్న దానిని నిలుపుకునే ప్రయత్నం చేయాలి. వెలిగించుకోవడం జరుగుతూ ఉంది. ఆరిపోవడం కూడా జరుగుతూనే ఉంది. పోగొట్టుకోకుండా పట్టుకునే పరిస్థితిని, వెలిగించుకొనే, కాపాడుకొనే కార్యాలను ఆవిష్కరించే కార్యక్రమాన్ని మనం నేడే ఆరంభించాలి.

**"దైవముతో నీ దినమును ఆరంభించుము. దైవముతో నీ దినమును పూర్తి చేయుము. దైవముతో నీ దినమును నింపివేయుము. దైవమును చేరుటకు ఇదియే మార్గము".**

**- శ్రీ స్వామి శివానంద**


**మాతృ ఆశ్రమం**

1. శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533446
వయా శంఖవరం, తూ॥గో॥ జిల్లా
ఫోన్ : 7382009962

**2. విశాఖ శాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం, ఫోన్ : 0891–2538689

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి,
విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్,
డార్‌మోనా రోడ్, కోటగిరి–643217
నీలగిరి జిల్లా, తమిళనాడు
ఫోన్ : 04266–271945

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్,
కాకినాడ–533 004, తూ॥గో॥ జిల్లా.

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టుపేట,
పిఠాపురం – 533 450.

# భగవద్రామానుజుల వారంటే ఎవరు?
# వారి గొప్పతనమేమిటి?

**(సహస్రాబ్ధి ఉత్సవాలు - 2017 సందర్భంగా)**

1. వారొక గొప్ప సంఘసంస్కర్త. సమాజ దురాచారాలని తొలగించి, సమ సమాజ స్థాపనకు అనితర సాధ్యమైన కృషి చేసారు.
2. సరిగ్గా 1000 సంవత్సరాల క్రితం 1017లో జన్మించారు వారు.
3. తమిళనాడులోని శ్రీపెరుంబూదూరులో జన్మించి, కాంచీపురంలో చదువుకొని, శ్రీరంగంలో స్థిరపడ్డారు. 120 సంవత్సరాలు జీవించారు. దేశమంతా పర్యటించారు.
4. తమ 33వ ఏట సన్యాసం తీసుకొని, యతివరులై జీవితాన్ని సమాజానికి అంకితం చేసారు.
5. వైదిక యజ్ఞాలలో జంతుబలిని నిషేధించిన మొదటివారు వీరే.
6. జాతి మత కులములతో సంబంధం లేకుండా, స్త్రీ పురుష బేధం లేకుండా అందరూ మంత్రోపదేశానికి అర్హులేనని ప్రకటించి, స్వయంగా తామే అందరికీ ఉపదేశించారు.
7. వైధవ్యము పొందిన స్త్రీలు 'గుండు' చేయించుకోవలసిన బలవంతపు ఆచారాన్ని ఖండించి, స్త్రీల ఆత్మగౌరవాన్ని నిలిపిన మొదటివారు వీరే.
8. దళితులైనా, ఇంకా ఎవరైనా సరే, భగవద్భక్తి కలిగినవారైతే చాలు ఆరాధింప తగిన వారే అని నిర్ణయించి, అట్టివారి విగ్రహాలను కూడ ఆలయాల్లో ప్రతిష్ఠింపచేసిన మహా పురుషులలో మొదటివారు వీరే.
9. ఈనాడు మనమందరము జాతి కులములతో సంబంధం లేకుండా స్వేచ్ఛగా ఆలయాల లోనికి ప్రవేశించగలుగుతున్నామంటే, దానికి మొట్టమొదటి కారణం భగవద్రామానుజుల వారి సంఘసంస్కరణాభిలాషే. కర్ణాటకలోని మేల్కోట ఆలయములోనికి దళితులను ఆనాడే ప్రవేశపెట్టిన వారు వీరు.
10. భగవదనుగ్రహం బ్రాహ్మణులకే అనీ, సన్యాసం తీసుకుంటే తప్ప మోక్షం లేదనీ వేదాలకి పెడర్థాలు చెప్తున్నవారిని ఖండించి వేద వాక్యాల ప్రమాణాన్ని చూపిస్తూ 'అందరికీ మోక్షార్హత' ఉన్నది అని వివరించిన వారు వీరే.
11. విశిష్టాద్వైత సిద్ధాంతమును వీరే ప్రవర్తింప చేసారు.
12. స్వామి నారాయణ్, ఇస్కాన్, వల్లభ, రామానంద మొదలైన దేశంలోని సమస్త వైష్ణవ సంప్రదాయాలకు ఆద్య పురుషులు వీరే.



13. కలలన్నీ కర్మానుభవాలే తప్ప కల్లలు కాదని ఉపనిషత్తుల ద్వారా వివరించినవారు వీరే.
14. భక్తి ఉద్యమాన్ని సమాజంలోని అన్ని తరగతుల వారిలో వ్యాపింపచేసి, భగవంతుడిని ప్రేమించడం ఎలాగో, ఆయన అంతర్యామిగా ఉండే సాటి మానవులను, ఇతర జీవులను కూడ ప్రేమించడం ఎలాగో నేర్పించిన మహానుభావులు వీరే.
15. భగవంతుడికి దయ, జాలి, కరుణ మొదలైన కళ్యాణ గుణాలుంటాయనీ, ఆయన మనలను సరిదిద్దాలనే చూస్తాడు తప్ప శిక్షించాలనుకోడు అని నిరూపించిన వారు వీరే.
16. ఏడుకొండల వాడికి శంఖచక్రములను సమర్పించి అతడు శ్రీమన్నారాయణుడే అని నిరూపించిన వారు వీరే. సంతోషించిన ఆ ఏడుకొండలవాడు వీరిని తనకు 'గురువు'గా సంభావించి, తన కన్న ఎత్తుగా ఉండే స్థానాన్ని ఏర్పాటు చేసిన విషయం, ఈనాటికి అందరం తిరుమలలో దర్శించవచ్చును.

ఈ క్రింది శ్లోకాన్ని ప్రతిరోజూ చదువుకుంటే రామానుజుల వారి అనుగ్రహముతో పాటు భగవదనుగ్రహము కూడ లభించి, ఆరోగ్యము, ఐశ్వర్యము, విద్యాభివృద్ధి కూడ కలుగుతాయి.

**వందే వేదాంత కర్పూర చామీకర కరండకమ్ !**
**రామానుజార్య మార్యాణాం చూడామణి మహర్నిశమ్ !**

## ఈశ్వర కృప

కర్మ నియమములను భగవంతుడే రూపొందించి యుండినందున, వాడు ఈ నియమములను ప్రక్కకు త్రోసివేయుటకు సమర్థుడు. అతడు తాను రూపొందించిన నియమాలను త్రోసివేయజాలనిచో ఆ నియమములు భగవంతుని కంటే బలవత్తరములగును. ఇది అసంభవము, యెందుకన అతడు అనంతుడు, సర్వశక్తుడగు ప్రభువు. అందువలన అగత్యమైనప్పుడు యేదైనా నియమమును కూడా అతిక్రమించుటకు అతనికి అధికారము ఉండితీరవలయును. సర్వ సాధారణముగా దేవుడు నియమ చాలనములో జోక్యము కల్గించుకొనకనే కర్మను తనంతట తానే ప్రవర్తించుటకు వదలును. అయితే కొన్ని విశేష సందర్భములందు కరుణాళువగు భగవంతుడు నియమములను మీరి, జీవాత్ముని కర్మ బంధనము నుండి విముక్తి గావించును.

## విజ్ఞప్తి !

# గోశాల పునర్నిర్మాణము

**ఓం నమో భగవతే ఓంకారాయ**

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

**ఓం శ్రీ గోమాత్రే నమః**

దివ్యాత్మ స్వరూపులకు ప్రణామములు. పూజ్య ఓంకారస్వామి స్థాపించిన గోశాలలో గోవులు - 25, దూడలు - 30, గిత్తలు - 7, దినాభివృద్ధి గావింపబడుతున్నాయి. గోఘృతంతో నిత్యం ప్రణవ హోమం నిర్వహించబడుచున్నది. గురుకుల బాలబాలికలకు, ఆశ్రమ వాసులకు గోక్షీరము వినియోగింపబడుచున్నది. గోమాతలు వశించు గోశాల శిథిలావస్థకు వచ్చినది. పూజ్య స్వామీజీ వారి ఆశీస్సులతో గోశాల పునర్నిర్మాణము చేయుటకు పూజ్య జ్ఞానేశ్వరి మాతాజీవారు సంకల్పించిరి. గోమాతలు నివశించుటకు 5 షెడ్డులు అవసరమున్నవి. ఒక షెడ్డు నిర్మాణమునకు సుమారు రూ॥ 5,00,000/- (ఐదు లక్షలు) ఖర్చు అగునని నిర్ధారణ చేయబడినది.

రూ॥ 10,000/- (పదివేలకు) పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఒక రోజునకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 150/-. ఒక నెలకు ఒక ఆవుకు గ్రాసము ఖర్చు రూ॥ 4,500/- అగును. వారి వారి శక్తి అనుసారము గ్రాసమునకు దాతలు సహకరించవలసినదిగా మా విన్నపము. గోగ్రాసమునకు సమర్పించిన దాతల నామ గోత్రములతో, గోవులకు గ్రాసము అందించబడును. ఒక గోవునకు సమర్పించిన గ్రాసము 10 అశ్వమేధ యాగములకు సమానము అని గోమహత్యంలో చెప్పబడినది.

ఆశ్రమ శ్రేయోభిలాషులు, గోమహత్యం పట్ల విశ్వాసం ఉన్న వాళ్ళు గోశాల పునర్నిర్మాణము మరియు గోగ్రాసము కొరకు ధన రూపంలో లేదా డి.డి. గాని, చెక్కు గాని శ్రీ శాంతి ఆశ్రమం పేరున విరాళము పంపగలరని విజ్ఞప్తి. మీ విరాళమునకు 80జి ప్రకారము ఇన్‌కంటాక్సు మినహాయింపు కలదు.

**ఓం తత్‌సత్**

గురుసేవలో

*- వినమ్రానంద సరస్వతి*



# దైవసాయుజ్యము

కోటగిరి శాంత్యాశ్రమశాఖ మాజీ కార్యదర్శి శ్రీ కుమారగమ్ గురుస్వామి గారు ది. 19-5-2017న దైవసాయుజ్యము పొందిరి. వీరు ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులు. ది. 1-9-1980వ సం॥లో పూజ్య ఓంకార్‌స్వామీజీ వారి ఆశీస్సులతో శ్రీ తెన్నేటి విశ్వనాధం గారి సమక్షంలో శ్రీ గురుస్వామి గారు కోటగిరిలో విశ్వశాంతి విద్యాలయమును ప్రారంభోత్సవము చేసిరి. వీరి చివరి శ్వాసవరకు ఆశ్రమములో అనేక సేవా కార్యక్రమములు, ఆధ్యాత్మిక, సాంఘిక కార్యక్రమములు నిర్వహించెడివారు.

స్వామి ఓంకార్‌జీ ఆత్మకధ, ఆధ్యాత్మిక మెఱుపులు, మౌనపు ఘడియలు అనేక గ్రంధములు ఆంగ్లము నుండి తమిళములోనికి అనువదించి ఆశ్రమాభివృద్ధికి తోడ్పడిరి. పలుమార్లు కోటగిరి శాంతి ఆశ్రమ భక్తులను, స్వామీజీలను, మాతృ ఆశ్రమమును సందర్శింపజేసెడివారు. వీరు భౌతికముగా లేకపోవడము ఆశ్రమమునకు తీరనిలోటు. వీరి ఆత్మశాంతికై ఆశ్రమ భక్తులు ప్రార్ధనలు చేసిరి. వీరి కుటుంబ సభ్యులకు పూజ్య ఓంకారస్వామీజీ మానసిక స్థైర్యమును ప్రసాదించెదరు గాక.

---

కాకినాడ వాస్తవ్యులు కీర్తిశేషులు పైడా శేషగిరిరావు గారి ధర్మపత్ని శ్రీమతి కనకదుర్గ గారు ది. 4-6-2017న విశాఖపట్నంలో దైవసాయుజ్యము పొందిరి. వీరు ఆశ్రమ భక్తులు, శ్రేయోభిలాషులు. వీరు ఆశ్రమమునకు అనేక విధములుగా సహాయ సహకారములను అందించెడివాడు. వీరి ఆత్మశాంతికై ఆశ్రమవాసులు ప్రార్ధనలు చేసిరి. వీరి కుటుంబ సభ్యులకు ఓంకారస్వామిజీ మానసిక శక్తిని ప్రసాదించెదరు గాక.

---

వెంకటనగరం వాస్తవ్యులు, ఆశ్రమ శ్రేయోభిలాషులు శ్రీ రోమాల నాగరాజు గారు ది. 10-6-2017న స్వర్గస్తులైనారు. వీరు ఆశ్రమ గోవుల సంరక్షణకై సలహాలు ఇచ్చెడివారు. వీరు పెద్దరాజు గారికి అత్యంత సన్నిహితులు. వీరి ఆత్మశాంతికై ఆశ్రమ వాసులు ప్రార్ధనలు చేసిరి. వీరి కుటుంబ సభ్యులకు పూజ్య ఓంకారస్వామీజీ మానసిక శక్తిని ప్రసాదించెదరు గాక.

# వార్తలు – కోటగిరి శాంత్యాశ్రమశాఖ

దిి. 5-5-2017న మాతృశ్రీ ఈశ్వరమ్మ ఆరాధన సందర్భంగా దిి. 8-5-2017 న కూనూర్ వాస్తవ్యులు శ్రీరాము గారు, సత్యసాయి భజనమండలి వారు భజనలు చేసిరి. శాంత్యాశ్రమ గురుకుల విద్యార్థులు సత్సంగము చేసిరి. అన్నదానము, వస్త్రదానము చేసిరి. దిి. 10-6-2017న పూజ్య ఓంకారస్వామీజీ వారి 35వ ఆరాధన సందర్భంగా ఉదయము ఓంకార స్వామీజీ వారి అష్టోత్తర శతనామార్చన, సత్యసాయి భజన మండలి వారిచే భజనలు, విశ్వశాంతి విద్యాలయ విద్యార్థులచే కీర్తనలు, శ్రీ భగవత్ చైతన్య గారిచే కీర్తనలు, ప్రవచనములు జరిగినవి. అన్నదానము, వస్త్రదానము జరిగినవి.

విశాఖ శాంత్యాశ్రమశాఖ, పిఠాపురం, కాకినాడ శాఖలలో అర్చన, అన్నదానము, వస్త్రదానములు నిర్వహింపబడినవి.

---

# వార్తలు – మాతృ ఆశ్రమం

**దిి. 10-6-2017 :** పరమపూజ్య శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామి వారి 35వ ఆరాధన దిి. 10-6-2017 తేదీన జరిగినది. ఉదయం గం11 5.30 ని11లకు శాంతి గణపతి మందిరంలో పూజ, ఉదయం గంII 5.45 నిIIలకు శాంతి స్థూపంలోని శ్రీ ఓంకారస్వామికి పుష్పామాలాంకరణ, జ్యోతి ప్రజ్వలన జరిగినది. ఉదయం 6 గంIIలకు దిగువ ప్రార్థనా మందిరంలో చేబ్రోలు బృందం వారిచే అఖండ హరే రామ నామ సంకీర్తన జరిగినది. ఉదయం 7 గంIIలకు ఓంకారమందిరంలో శ్రీశ్రీశ్రీ ఓంకారస్వామి దివ్యపాదు కలకు అష్టోత్తర శతనామార్చనతో షోడశోపచార పూజ శ్రీ భాస్కరేంద్ర సర్వస్వతి స్వామి, పూజ్యశ్రీ స్వామి నిర్మలానందగిరి స్వామి, (వృద్ధజన గోకుల సేవాశ్రమం, భీమిలి మండలం, జొన్నాడ) వారిచే జరుపబడినది. ఉదయం గంII 8.30 నిIIలకు శ్రీ చేకూరి వెంకటరాజు గారి సమాధికి పూజ జరిగినది. 'డివైన్ వాయిస్ ఆఫ్ ఓంకార్" గ్రంథము రెండవ ముద్రణ పూజ్యశ్రీ నిర్మలానంద గిరి స్వామివారిచే ఆవిష్కరింపబడింది. సాయంత్రం గంII 6.15 నిIIలకు ఓంకారమందిరంలో పూజ్యశ్రీ నిర్మలానందగిరి, శ్రీ బ్రహ్మచారి ఉపేంద్ర చైతన్య గార్ల ఉపన్యాసాలు జరిగినవి.

---

**బ్రహ్మలీన చిదానందస్వామి జన్మతేది 24న,** ప్రతి నెలవలె ఈ నెల కూడ మాతృ ఆశ్రమం, కాకినాడ, పిఠాపురం, కోటగిరి, విశాఖ శాఖలలో వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ జరుగెను.



## విరాళములు

| | | |
|---|---|---|
| 1. | రూ. 1,000-00 | శ్రీ జి. సాంబమూర్తి గారు, హైదరాబాద్ |
| 2. | రూ. 1,116-00 | శ్రీమతి ఎమ్. కన్నెమ్మ గారు, తిరుత్తాని. |
| 3. | రూ. 1,117-00 | శ్రీ యు. రామగోపాల్ గారు, తుని |
| 4. | రూ. 1,000-00 | శ్రీ జి. వెంకటేష్ గారు, విశాఖపట్నం |
| 5. | రూ. 1,116-00 | శ్రీ డి.వి.ఆర్. ఆంజనేయులు గారు, విశాఖపట్నం పూజ్య ఓంకారస్వామి వారి ఆరాధన నిమిత్తం |
| 6. | రూ. 1,000-00 | Mrs. టి. గీతాంజలి గారు |
| 7. | రూ. 1,000-00 | Mrs. టి. గీతాంజలి గారు |
| 8. | రూ. 1,000-00 | శ్రీ కె. రాజారావు గారు, విశాఖపట్నం |
| 9. | రూ. 10,000-00 | శ్రీ టి. వేదాంతం గారు, విశాఖపట్నం |
| 10. | రూ. 15,000-00 | శ్రీ కోలా సత్యనారాయణమూర్తి గారు, శ్రీ శాంతి ఆశ్రమం ఓం మందిరం గ్రిల్సు వేయుటకు |
| 11. | రూ. 3,000-00 | శ్రీ మర్రి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ & ఛారిటబుల్ ట్రస్టు, సికింద్రాబాద్. కీIIశేII డాII మర్రి చెన్నారెడ్డి గారి జన్మదిన జ్ఞాపకార్థం |

## పశు సంరక్షణ

| | | |
|---|---|---|
| 1. | రూ. 4,000-00 | శ్రీ కోలా జగదీష్ గారు, కాకినాడ, వట్టిగడ్డి నిమిత్తం |
| 2. | రూ. 4,000-00 | శ్రీ కోలా జగదీష్ గారు, కాకినాడ, వట్టిగడ్డి నిమిత్తం |
| 3. | రూ. 1,000-00 | శ్రీ నల్లం సత్యనారాయణ గారు, కాకినాడ వీరి కుమారుడు చిII భాను వెంకట నగేష్ గారి పుట్టినరోజు సందర్భముగా గోగ్రాసం నిమిత్తం |
| 4. | రూ. 1,000-00 | శ్రీ నల్లం సత్యనారాయణ గారు, వీరి కోడలు చిII సౌII సుధారాణి గారి పుట్టినరోజు సందర్భముగా గోగ్రాసం నిమిత్తం |
| 5. | రూ. 2,000-00 | శ్రీమతి బి. సుబ్బలక్ష్మి గారు, కాకినాడ, గోగ్రాసం నిమిత్తం |
| 6. | రూ. 10,000-00 | శ్రీమతి ఎమ్. జలజాక్షి గారు, W/o. ఎమ్. విశ్వనాథరావు గారు గోశాల నిర్మాణము నిమిత్తం |
| 7. | రూ. 2,000-00 | శ్రీ కె.డి. రావు గారు, సికింద్రాబాద్, గోశాల నిర్మాణము నిమిత్తం |

## శాశ్వత అన్నదాన పధకము

| | | |
|---|---|---|
| 1. | రూ. 5,000-00 | శ్రీమతి దాట్ల దీప్తి గారు (పెనుమత్స సూర్యాకాంతం గారి మనుమరాలు) శ్రీ దాట్ల శివరామరాజు గార్లు, విశాఖపట్నం, వీరి కుమారుడు చిII అభినవవర్మ గారి పుట్టినరోజు సందర్భంగా |
| 2. | రూ. 5,000-00 | శ్రీ రొంగల సూర్యనారాయణ గారు, శ్రీ శాంతి ఆశ్రమం వీరిభార్య కీIIశేII రొంగల భారతమ్మ గారి జ్ఞాపకార్థం |